నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
గురువారం | 11 జులై 2024 | www.navatelangana.com

అప్పుల బాధతో వ్యక్తి బలవన్మరణం




నవతెలంగాణ-దుబ్బాక రూరల్

అప్పుల బాధతో వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన దుబ్బాక మండల పరిధిలోని అప్పనపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం అప్పనపల్లి గ్రామానికి చెందిన ఛత్రి కనకయ్య (42) గత కొంతకాలంగా అప్పుల బాధతో బాధపడుతున్నాడు. గత సంవత్సరం కొత్త ఇల్లు నిర్మాణం, పిల్లల చదువు కోసం సుమారు రూ.10 లక్షలు అప్పు చేశాడు. ఆ అప్పును వాయిదా పద్ధతిలో చెల్లిస్తున్నాడు. ఈ వారం అప్పులు చెల్లించడానికి నగదు సమకూరలేదని తన భార్యతో చెబుతూ బాధపడుతుండేవాడని అప్పుల బాధ భరించలేక తనకు తాను మనస్థాపం చెంది వ్యవసాయ పొలం వద్ద తుమ్మ చెటుకు ఉరేసుకుని ఆత్మహత్య పాల్పడినట్లు తెలిపారు. మృతుడి బావ ద్వార సమాచారం తెలుసుకున్న మృతుడి కుటుంబీకులకు కన్నీరు మున్నీరయ్యారు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మెదక్ ఎస్పీగా ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఈస్ట్‌జోన్ డీసీపీగా బాలస్వామి బదిలీ



నవతెలంగాణ-మెదక్ టౌన్

రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐపీఎస్ అధికారుల్ని బదిలీ చేసింది. అందులో భాగంగా మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి కూడా బదిలీ అయ్యారు. ఆయన స్థానంగా నూతన ఎస్పీగా ఉదయ్‌కుమార్‌రెడ్డి జిల్లాకు వచ్చారు. ఉదయ్‌కుమార్‌రెడ్డి సౌత్, వెస్ట్‌జోన్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పనిచేశారు. మెదక్ ఎస్పీగా పనిచేసిన బాలస్వామి హైదరాబాద్ ఈస్ట్‌జోన్ డీసీపీగా వెళ్లారు. ఇటీవల మెదక్‌లో జరిగిన బక్రీద్ పండుగ రోజు జరిగిన అల్లర్ల విషయంలో ఎస్పీ వ్యవహారంపై పలు పిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తుంది. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అప్పట్లోనూ అప్పటి ఎస్పీపై పలు విమర్శలు కూడా చేశారు.

పాల కల్తీ పట్టదా..!



- జోరుగా కల్తీ పాల దందా
- ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం
- పాలు, పాల పదార్థాల్లో నాణ్యత డొల్ల
- యూరియా ఇతర పదార్థాలతో పాల తయారీ
- తెల్లనివన్నీ పాలని నమ్మితే హానికరమే
- సామర్థ్యం కంటే అధిక పాలు
- తనిఖీలు చేస్తున్నం: ధర్మేంద్ర

తెల్లనివన్నీ పాలు కావనే చేదు నిజం తెల్సుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఎందుకంటే ఆరోగ్యానికి మేలు చేసే పాలే అనారోగ్యం పాలు చేస్తున్నాయి. రకరకాల పేర్లతో ప్యాకింగ్ పాలు, చిక్కటి పాల పేరుతో లూజ్ పాల వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రజలు తమ అవసరాల కోసం అందుబాటులో లభించే పాలను కొనుగోలు చేస్తున్నారు. పాలల్లో కల్తీని గుర్తించడం కష్టం కావడంతో వినియోగదారుల నమ్మకాన్ని కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. కల్తీ పాల తయారీకి పాల్పడుతున్నారు. పాడి గేదెలు, ఆవుల పాలల్లో నీళ్లు కలపడమే కాదు ఏకంగా యూరియా, నూనె, పాల పౌడర్‌తో కృత్రిమ పాలను తయారు చేస్తున్నారు. పేరొందిన బ్రాండ్లతోనే ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. నిత్యం ఇంట్లో హోటళ్లలో టీ, కాఫీకి పాలను వినియోగిస్తారు. పాలతో పెరుగు, ఐస్‌క్రీమ్, స్వీట్స్ ఇతర పాల పదార్థాలు తయారవుతాయి. కల్తీ పాలతో తయారయ్యే టీ, కాఫీ మొదలుకుని తినుబండారాల వల్ల ప్రజల ఆరోగ్యాల్ని పాడు చేస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పాల నాణ్యతపై నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

కల్తీకి కాదేదీ అనర్హం అన్నట్లుగా మారింది. నిత్యం తాగే పాలు, తినే ఆహార పదార్థాలన్నీ కల్తీ మయం అవతున్నాయి. ఇటీవల ఆహార తనిఖీ అధికారులు జరిపిన దాడుల్లో కల్తీ, నాసిరకం, కాలం తీరిన పదార్థాల వాడకం లోగుట్టు వెలుగు చూసింది. హోటళ్లు, హాస్టళ్లు, క్యాంటిన్లు, మెస్‌లు ఇలా ప్రతిదాంట్లోనూ కల్తీ ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. చివరికి పిల్లలు, పెద్దలు తాగే పాలు సైతం కల్తీ మయం అవుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో పాల వినియోగం అధికంగా ఉంటుంది. పారిశ్రామిక, వ్యాపార, విద్యా కేంద్రంగా ఉన్న సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో పాల ఉత్పత్తి కంటే వినియోగం అధికంగా ఉంటుంది. సంగారెడ్డి జిల్లాలో 120000 లీటర్లు, సిద్దిపేట జిల్లాలో 90 వేల లీటర్లు, మెదక్ జిల్లాలో 40 వేల లీటర్ల పాల వినియోగం జరుగుతుంది. పారిశ్రామిక వాడల్లో వేలాది మంది కార్మికులు, విద్యా సంస్థలున్న ఏరియాల్లో వేలాది మంది విద్యార్థులున్నారు. జాతీయ, రాష్ట్ర ప్రధాన రహదారులున్న జిల్లాలు కావడంతో హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు అధికంగా ఉన్నాయి. సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు, నారాయణఖేడ్, జోగిపేట, తెల్లాపూర్, బొల్లారం, అమీన్‌పూర్, మెదక్, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట, గజ్వేల్, చేర్యాల, దుబ్బాక, సిద్దిపేట, హుస్నాబాద్ వంటి మున్సిపాలిటీ కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో సైతం పాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయితే మదర్ డైయిరీ ఇతర బ్రాండెడ్ పాలతో పాటు స్థానికంగా ఉన్న డైయిరీస్ కూడా పాల సేకరణ చేస్తూ విక్రయిస్తున్నాయి. డైయిరీ ఫామ్ నుంచి నేరుగా లూస్ పాలను సైతం చిక్కటి పాలను విక్రయిస్తున్నారు. వీటితో పాటు కొందరు కల్తీ పాలను తయారు చేసి వినియోగదారులకు అంటగడుతున్న పరిస్థితి ఉంది. దీంతో వినియోగదారులు ఏవి నాణ్యమైన పాలో ఏవి కల్తీ పాలో తెల్సుకోలేకపోతున్నారు.

గుట్టుగా కల్తీ పాల దందాలు

కల్తీ పాల దందా గుట్టుగా సాగుతుంది. ఎక్కడైనా అనుమానంతో పిర్యాదు చేస్తే తప్ప దాడులు, తనిఖీలు చేస్తున్న పరిస్థితి లేకపోయే సరికి కల్తీ పాల తయారీ జోరుగా సాగుతుంది. ఇటీవల హత్నూర మండంలోని ఓ పౌల్టీఫామ్‌ను అడ్డాగా చేసుకుని కొందరు కల్తీ పాలను తయారు చేస్తూ పట్టుబడ్డారు. యూరియా, నూనె, పాల పౌడర్‌తో కల్తీ పాలను తయారు చేసి విక్రయించారు. తూప్రాన్, సిద్దిపేట, బొల్లారం, మెదక్, ఇతర ప్రాంతాల్లోనూ కల్తీ పాలు తయారు చేస్తూ పట్టుబడ్డారు. అయితే పిర్యాదు చేస్తే తప్ప దాడులు చేసే పరిస్థితిలేదు. గుట్టుగా ఉంటే పాత భవనాలు, ప్యాక్టరీ భవనాలు, పౌల్టీ ఫామ్స్‌ను అడ్డాగా చేసుకుని యూరియా, నూనె, పాల పౌడర్, షాంపోలను వినియోగించి పాలను తయారు చేస్తున్నారు. కల్తీ పాలు తయారు చేసి ఏదో ఒక బ్రాండ్ పేరిట ప్యాకింగ్ చేస్తున్నారు. కొందరేమో లూస్ పాలను హోటళ్లు, స్వీట్‌హౌస్‌లు, బేకరీలకు పంపుతున్నారు. వాస్తవంగా పాలను అధికంగా టీ స్టాల్స్, టీ పాయింట్స్, టీ హోటళ్లు, బేకరీలు, హాస్టళ్లు, స్వీట్‌హౌస్, ఐస్ పార్లర్లు ఎక్కువ మొత్తంలో పాలను వినియోగిస్తారు. ఎక్కువ మొత్తంలో పాలను వాడే చోట కల్తీ పాలను కూడా కలుపుతున్నట్లు తెలుస్తోంది. పంక్షన్లకు అధిక మోతాదులో పెరుగు, స్వీట్స్‌ను వినియోగిస్తారు. అలాంటి చోట్ల కూడా కల్తీ పాలు కలుస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సామర్థ్యం కంటే అధిక పాలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో పాల ఉత్పత్తి సామర్థ్యం కంటే ఎక్కువ విక్రయాలు సాగుతున్నాయంటున్నారు. మదర్ డైయిరీ, దొడ్ల, ఆరోక్య, తిరుమల, కరీంగనర్ డైయిరీ, హెరిటేజ్ వంటి బ్రాండ్లకు చెందిన పాల విక్రయాలు సాగుతున్నాయి. వీటితో పాటు కర్నాటక, మహారాష్ట్రకు చెందిన పలు బ్రాండ్ల పాలు కూడా అధికంగానే ఇక్కడ విక్రయాలు సాగుతున్నాయి. మూడు జిల్లాల్లోనూ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ద్వారా పాల సేకరణ జరుగుతుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మినీ డైయిరీఫామ్స్, వ్యక్తిగతంగా పాడి పశువులు, గేదెల్ని పెంచుతున్నారు. వాటి ద్వారా రోజువారిగా జరిగే పాల ఉత్పత్తికి రోజువారిగా జరుగుతున్న విక్రయాలకు ఎంతో తేడా ఉంటుంది. బయటి ప్రాంతాల నుంచి వచ్చే పాలు ఉన్నప్పటికీ స్థానికంగా గుట్టుగా కల్తీ పాల తయారీ సాగుతుండడం వల్లనే అధిక విక్రయాలు జరుగుతన్నట్లు చెబుతున్నారు. సహాజసిద్ధంగా ఉత్పత్తి జరిగే పాలతో పాటు కల్తీ పాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

కల్తీ పాల వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం:

డాక్టర్ శ్రీహరి, వైద్య నిపుణులు

పాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చిన్న పిల్లలు, అనారోగ్యంతో బాదపడే వాళ్లకు పౌష్టికాహారంగా వినియోగిస్తారు. పాలు, పాల ఉత్పత్తులు మంచి పౌష్టికాహారంగా ఉపయోగపడుతుంది. అయితే పాలల్లోనూ కల్తీ జరుగుతండడంతో ప్రజల ఆరోగ్యాలపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా కడుపు ఉబ్బరం, దీర్ఘకాలంలో కాన్సర్ వ్యాధికి గురయ్యే ప్రమాదుమంది. ముత్రపిండాలు, కాలేయం పనితీరు దెబ్బతింటుంది. కల్తీ పాలు ప్రమాదరకంగా మారుతాయి.

తనిఖీలు చేస్తున్నం:

ధర్మేంద్ర, ఫుడ్ ఇన్స్పెక్టర్

కల్తీని అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు జరుపుతున్నాం. పిర్యాదు చేస్తే వెంటనే దాడులు జరిపి కల్తీని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. పిర్యాదుదారుల పేర్లను గోప్యంగా ఉంచబడతాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా హోటళ్లు, హాస్టళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, బేకరీలు, మెస్‌లను తనిఖీ చేస్తున్నాం. కల్తీని గుర్తించి కేసులు పెట్టాం. నోటీసులు జారీ చేశాం. కల్తీ పాల తయారీ, పాలను కల్తీ చేయడం ఏది చేసినా చర్యలు తప్పవు.

ప్రాణాలైనా ఇస్తాం మా భూములు మాత్రం ఇవ్వం

సంగారెడ్డి కెనాల్ సర్వేను అడ్డుకున్న చిన్నచింతకుంట గ్రామస్తులు

భూమికి బదులు భూమి ఇవ్వాలి రైతుల డిమాండ్



నవతెలంగాణ-నర్సాపూర్

కొండపోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డి కెనాల్ రీచ్ టు కాలువ నిర్మాణానికిగాను భూములను సర్వే చేయడానికి ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు డిఈ కవితా దేవి, ఏఈలు శ్రీనివాస్ గౌడ్, సుప్రజ, శైలజలు బుధవారం నర్సాపూర్ మండల పరిధిలోని చిన్నచింతకుంట కు వచ్చారు. వారు గ్రామ శివారులో సర్వే చేస్తుండగా, విషయం తెలుసుకున్న కాలువలో భూములు కోల్పోతున్న రైతులు కొండపోచమ్మ కాలువ తమకు వద్దని ఈ సర్వే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సర్వే చేయడానికి వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులు మాట్లాడుతూ ఈ కాలువ కింద భూములు కోల్పోతున్న రైతులందరూ పేదవారమేనన్నారు. ఎకరాకు నష్టపరిహారం రూ.60 లక్షలు ఇవ్వాలని, లేకపోతే భూములకు బదులు భూమిని ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో కొండపోచమ్మ కాలువ మాకొద్దు పేద రైతులకు న్యాయం చేయాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గతంలో రింగ్ రోడ్డుకు పేద రైతుల ఎందరో భూములు కోల్పోయి బజారున పడ్డారని ప్రస్తుతం ఈ కొండ పోచమ్మ కాలువకు భూములు ఇవ్వడంతో రైతులు పూర్తిగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు తగిన న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అయితే రైతులకు అధికారులు ఎంత చెప్పినా వినకపోవడంతో అధికారులు సర్వే చేయకుండానే వెనుతిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో రైతులు నరసింహారెడ్డి, మహేష్ గౌడ్, పెంటయ్య, అర్జున్, శ్రీనివాస్ గౌడ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-సంగారెడ్డి


టీజీపీఎస్సీ గ్రూప్-1 (మెయిన్స్) పరీక్షకు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారని సంగారెడ్డి జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి. ప్రవీణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సైదాబాద్ శిక్షణా కేంద్రంలో 150కి, ఖమ్మంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో 150 మందికి శిక్షణ ఇస్తారన్నారు. ఈనెల 22 నుంచి 75 రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. కాబట్టి గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హత సాధించిన సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా ఈనెల 10 నుంచి 19 వరకు దరఖాస్తులు సమర్పించుకోవచ్చని తెలిపారు. అభ్యర్థి తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.5 లక్షల లోపు ఉండాలన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంపిక ఉంటుందన్నారు. కోచింగ్ వ్యవధిలో ప్రతీ అభ్యర్థికి నెలకు రూ. 5000 స్టైఫండ్ (బుక్‌ఫండ్, రవాణాతో సహా) అందిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 08455-277015, 9949592991 నెంబర్లను లేదా సంగారెడ్డిలోని బీసీ స్టడీసర్కిల్ కార్యాలయం, వెలుగు ఆఫీస్ క్యాంపస్, బైపాస్ రోడ్‌ను సంప్రదించాలన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-పుల్కల్ : రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు తలారి అంజయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుల్కల్ మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట గ్రామ శివారు లో గల సబ్ స్టేషన్ ద్వారా పెద్దారెడ్డిపేట, సింగూర్, మంతూర్, రైపాడ్ తదితర గ్రామాలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా విద్యుత్ సరఫరా జరుగుతున్న దన్నారు. గత ప్రభుత్వంలో మారుమూల గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని.. కానీ తమ ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల్లోనే రైతు సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కొన్ని అనివార్య కారణాలవల్ల పూరి స్థాయిలో ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో నెర వేర్చలేకపోయామన్నారు. ఆగస్టు 15 నాటికి అన్ని హామీలను నెరవేర్చి తీరుతామన్నారు.

డీఎస్సీని అడ్డుకునేందుకు కుట్రలు



నవతెలంగాణ-తూప్రాన్

కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో జరుగుతున్న డీఎస్సీని అడ్డుకోవాలని కేటీఆర్, హరీష్‌రావులు కుట్రలు చేస్తున్నారని మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ మండిపడ్డారు. కోచింగ్ సెంటర్ల వ్యాపారం కోసమే పరీక్షలు వాయిదా వేయాలని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు చూస్తున్నారన్నారు. నిరాహార దీక్షల్లో పేద విద్యార్థులు, పేద నేతలు మాత్రమే కూర్చుంటున్నారని కేటీఆర్, హరీష్ రావులు ఎందుకు కూర్చోవడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగులు ప్రతిపక్షాల ట్రాప్‌లో చిక్కుకోవద్దని భాగ్యరాజ్ సూచించారు.

బిలియా నాయక్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల ట్రైబల్స్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బిలియా నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి జిల్లా ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు హరినాయక రాథోడ్ రాథోడ్, రాష్ట్ర ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ధనరాజ్ రాథోడ్, డా.బెల్లయ్య నాయక్, గిరిడర్ రాథోడలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కొమ్మూరిని కలసిన దేవాలయ కమిటీ సభ్యులు



నవతెలంగాణ-చేర్యాల

జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డిని మండల పరిధిలోని నాగపురి శివారులో గల నల్ల పోచమ్మ దేవాలయ కమిటీ సభ్యులు బుధవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కలిశారు. దేవస్థానం అభివృద్ధి తోపాటు దేవాలయ భూమిని పరిరక్షించాలని కోరారు.ఈ విషయాన్ని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని కొమ్మూరి తెలిపినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ గూడపు మహేష్ పేర్కొన్నారు.కొమ్మూరిని కలసిన వారిలో దేవాలయ కమిటీ సభ్యులు ఉన్నారు

ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

నిధులు విడుదల చేయకుండా కేవలం ప్రొసీడింగ్ ఇచ్చి పనులు ప్రారంభించి కాంట్రాక్టర్లను ఉరివేసుకునేటట్టు చేసి 10 ఏళ్ళు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వంమే అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ నాయకులు సర్దార్ ఖాన్, నక్క రాములు గౌడ్, గుంటుకు శ్రీనివాస్, పంజాల రాజు గౌడ్‌లు ఆరోపించారు. బుధవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి ఇంటి వద్ద నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ 10 ఏళ్ళ అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకులు చేసిన అభివృద్ధిని రుజువు చేయాలని, బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డికి సవాల్ విసినారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మతిన్, సమీర్, కన్న యాదవ్, రమేష్, బలరాం, ఉమేష్ యాదవ్, అంజి, తిరుపతి పాల్గొన్నారు.

ముదిరాజులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి




నవతెలంగాణ-సంగారెడ్డి

ముదిరాజులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సంగారెడ్డిలో మందుల వరలక్ష్మి, నారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహా సభ ఉపాధ్యక్షుడు బోద్రమోని యాదగిరి ముదిరాజ్ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం యాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాష్ ఆదేశాలతో గోడ పత్రికను ఆవిష్కరించినట్లు చెప్పారు. అభయ హస్తం లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ(డీ) నుండి బీసీ(ఏ) గ్రూప్ కు మార్చాలని కోరారు. మంత్రి వర్గంలో ముదిరాజులకు స్థానం కల్పించి.. ముదిరాజుల అన్ని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి మాట్లాడుతూ.. ముదిరాజ్ విద్యార్థులకు గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసి.. ముదిరాజ్ కార్పొరేషన్‌కు వెయ్యి కోట్ల నిధిని మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నారాయణ ముదిరాజ్, జిల్లా నాయకులు భూలక్ష్మీ, లావణ్య, లక్ష్మీ ప్రియ,డాక్టర్ శిల్ప, హరీష్ కుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ(డీ) నుంచి(ఏ) గ్రూప్‌కి మార్చాలని ముదిరాజ్ మహాసభ ఆందోల్ నియోజకవర్గ ఇన్చార్జ్ డిబి. నాగభూషణం అన్నారు. జోగిపేట ముదిరాజ్ సంఘంలో స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 15వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు ప్రతీ మండల, తహసీల్దార్, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో వినతి పత్రాలు ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం ముదిరాజులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ముదిరాజ్ నాయకులు జంగిలి వెంకటేశం, నార్సింగ్ సాయిబాబా, అరిగె వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆర్సీఓ కార్యాలయ ముట్టడి

కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్

గురుకుల విద్యార్థినుల ఆత్మహత్యలు, ప్రమాదాలపై సమాగ్రా విచారణ జరపాలని డిమాండ్



నవతెలంగాణ-సంగారెడ్డి

గురుకుల విద్యార్థినుల ఆత్మహత్యలు, ప్రమాదాల పై సమాగ్రా విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ.. రేపు(శుక్రవారం) ఆర్సీఓ కార్యాలయ ముట్టడి నిర్వహించనున్నట్లు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్ తెలిపారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) సంగారెడ్డి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.అశోక్ మాట్లాడుతూ.. గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతేడాది అందోల్, రంజోల్ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలే రాయికోడ్ గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని రెండో అంతస్తు పై నుంచి కిందపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నదన్నారు. వాటన్నింటిపై సమగ్ర విచారణ జరపాలని.. జిల్లాలో ప్రిన్సిపాల్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయని ఇంచార్జిలతో నడిపిస్తున్నారని వెంటనే భర్తీ చేయాలని.. రెగ్యులర్ టీచింగ్ స్టాఫ్, కేర్ టెకర్స్, అవసరమైన కుకింగ్ స్టాఫ్‌ను నియమించాలని.. విద్యార్థుల అవసరమైన అన్ని రకాల మెటీరియల్ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ రేపు(శుక్రవారం) సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల రీజినల్ కో-ఆర్డినేటర్ (ఆర్సీఓ) కార్యాలయ ముట్టడి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ముట్టడి కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరి శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు దత్తు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ,ఎంపీటీసీలకు ఘన సన్మానం



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో మద్దూరు మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, జాలపల్లి,అర్జునపట్ల, కమలాయపల్లి, మాజీ ఎంపీటీసీ చెట్కూరి కళ్యాణి కమలాకర్ యాదవ్, లను గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ, ఎంపీటీసీలు మాట్లాడుతూ జాలపల్లి గ్రామంలో పుట్టిన తమను ఒక కుటుంబ సభ్యులుగా గ్రామస్తులు ఆదరించి అధిక మెజార్టీతో గెలిపించినందుకు ఎప్పటికీ గ్రామ ప్రజలకు రుణపడి ఉంటామని వారు తెలిపారు. ప్రజాసేవే తమ సేవా అని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

జేఎన్టీయూ ఫుడ్ కాంట్రాక్టర్‌ను తొలగించాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట ధర్నా



నవతెలంగాణ-పుల్కల్, జోగిపేట

జేఎన్టీయూ కళాశాల ఫుడ్ కాంట్రాక్టర్‌ను తక్షణమే తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను బహిర్గతం చేస్తే.. బెదిరించడం ఎంతవరకు సమంజసమన్నారు. సమస్యలు చెబితే ఫెయిల్ చేస్తారా అని ప్రశ్నించారు. చట్నీలో ఎలక రావడం చూస్తుంటే.. విద్యార్థుల పట్ల ఎంత శ్రద్ధ తీసుకుంటున్నారో అర్థమవుతుందన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఆరోపించారు. డబ్బులు వసూలు చేసి నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు చెబుతున్నారని ఆరోపించారు. హాస్టల్ పరిసర ప్రాంతాలు చెత్తా చెదారంతో కూడుకున్నా యన్నారు. గర్ల్స్ హాస్టల్ పక్కన చెత్తాచెదారాన్ని తగలబెట్టడంతో దుర్వాసన వెదజల్లుతుందన్నారు. తక్షణమే హాస్టల్ సమస్యపై అధికారులు స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రవికిరణ్ గౌడ్, ఎస్ఎఫ్ఐ అందోల్ మండల కార్యదర్శి హరి కిరణ్, నాయకులు కుమార్, రాజు, విజయ్, విష్ణు, మనోజ్, వరుణ్ పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-కోహీర్

మండల పరిధిలోని దిగ్వాల్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన సైబర్ సెక్యూరిటీ, డ్రగ్స్ దుర్వినియోగం పై బుధవారం అవగాహన కల్పించారు. నోడల్ అధికారి మరియు గెజిటెడ్ హెడ్‌మాస్టర్ మహ్మద్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో పోలీసుశాఖ సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఎవరైనా దూషించినప్పుడు ఏం చేయాలి.. అత్యవసర రక్షణ విషయంలో, డయల్ 100 వినియోగాన్ని పోలీసు అధికారులు గవివరించారు. వాట్సాప్‌లో వచ్చే లింక్‌లపై క్లిక్ చేయొద్దన్నారు. కొంతమంది విద్యార్థులు కొరెక్స్ వంటి వైట్‌నర్‌ను డ్రగ్‌గా ఉపయోగిస్తున్నారని.. అది క్యాన్సర్‌కు దారి తీస్తుందన్నారు. కాబట్టి అలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పోలీసు అధికారులు పలు విషయాల గురించి ప్రశ్నించగా.. విద్యార్థులు చక్కగా సమాధానం చెప్పారు. విద్యార్థుల నుంచి మంచి స్పందన రావడంతో పోలీసు అధికారులు ఉపాధ్యా యులు, విద్యార్థులను అభినందించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ కిష్టయ్య, హెడ్ కానిస్టేబుల్ సంజీ వయ్య, కానిస్టేబుళ్ళ తుకారాం,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ లారి జప్తు




నవతెలంగాణ-నార్సింగి : అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న టిప్పర్ లారీని పోలీసులు జప్తు చేసి, కేసు నమోదు చేసిన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారి 44 పై సరోజినీ నగర్ వద్ద చోటు చేసుకుంది. కేసు వివరాలను ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దిన్ విలేకరులకు వివరించారు. అక్రమంగా మట్టి రవాణా చేస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు మండల పరిధిలోని సరోజినీ నగర్ వద్ద కాపు కాసామని ఎస్ఐ తెలిపారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ లారీని గమనించి ఆపడానికి ప్రయత్నించగా డ్రైవర్ లారీని వేగంగా నడుపుతూ పారి పోవడానికి ప్రయత్నించాడు. టిప్పర్‌ను వెంబడించి ఆపి టిప్పర్ డ్రైవర్‌ను మట్టి రవాణా అనుమతి పత్రాలు చూపాలని అడగ్గా అతని వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేవని తెలిసిందన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న టిప్పర్ లారీ (35 టీ 0614) ని జప్తు చేసి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. డ్రైవర్ పేరు మాలోత్ రాజు (35)ను తూప్రాన్ మం కాళ్లాపూర్ గ్రామ నివాసిగా గుర్తించామన్నారు. మట్టి తరలిస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశ పడి లారి యజమాని యాదగిరి ఆదేశానుసారం జప్తి శివనూర్ అమ్మ కుంట నుంచి మట్టిని తవ్వి తరలిస్తున్నట్లు డ్రైవర్ తెలిపాడన్నారు. కేసు నమోదు చేసి వాహనాన్ని మైనింగ్ శాఖకు అప్పగిస్తున్నట్టు తెలిపారు. అక్రమ మట్టి రవాణాపై నార్సింగి ఆర్.ఐను సంప్రదించగా అక్రమంగా మట్టిని తరలిస్తున్న విషయం వాస్తవమేనని, బుధవారం ఇరిగేషన్ ఏ.ఈ ప్రదీప్‌తో పాటు జప్తి శివునూరు పరిధి లోని అమ్మ కుంట వెళ్లి పరిశీలించామన్నారు. ఈ విషయమై నార్సింగి పోలీసులకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి సంయుక్తంగా ఫిర్యాదు చేశామని, అక్రమార్కులపై శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంగారెడ్డిలో జాతీయ ఫిష్ డే వేడుకలు

నవతెలంగాణ-సంగారెడ్డి



మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో జాతీయ ఫిష్ డే వేడుకలను సంగారెడ్డిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మత్స్య శాఖ జిల్లా డైరెక్టర్, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు నగేష్ ఆధ్వర్యంలో జాతీయ మత్స్య రైతుల దినోత్సవం పురస్కరించుకొని సంగారెడ్డి పట్టణంలోని మత్స్య సహకార సంఘం చేపల మార్కెట్‌లో ఫిష్ డేను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నరసింహరాజు కార్యదర్శి చిదంబరసాయి డైరెక్టర్ రాఘవేంద్ర, వంశీ,గుర్రంనగేష్, శ్రద్ధానంద్, అశోక్, కుల పెద్దలు గుర్రం సత్యనారాయణ, ఆంజనేయులు, బాలరాజు, దీన్‌దాయల్, సునీల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు

నవతెలంగాణ-జోగిపేట



జోగిపేట మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో మాజీ వార్డు సభ్యులు చింతకుంట శివకుమార్ సొంత డబ్బులతో స్పీడ్ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేయించారు. కాలనీ వాసులతో కలిసి బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. సుమారు రూ.12 వేల తనసొంత డబ్బులతో మూడు చోట్ల ఈ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. రోడ్లపై నుంచి వాహనాలు నిత్యం తిరుగుతుంటాయని, చిన్నపిల్లలు ఆడుకుంటున్న సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 11వ వార్డు అభివృద్ధికి తనకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందజేస్తారని తెలిపారు. స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయడంతో కాలనీ ప్రజలు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ యువ నాయకులు బిర్ల శంకర్, ఊస నాగరాజు, మహేష్ యాదవ్, నాయి కోటి అశోక్, గొర్లకాడి వెంకటేశం, ప్రభు, ఎర్రగొల్ల నరేష్, వి.శివశంకర్, ఎం.నాగరాజు, సాయి, రాములు తదితరులు పాల్గొన్నారు.

రేపు సంగారెడ్డిలో జాబ్ మేళా

నవతెలంగాణ-సంగారెడ్డి

డీఆర్‌డీఏలో రేపు(శుక్రవారం) జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి ఏ.వందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 135 ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సి పాస్ అయి.. 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలన్నారు. రూ.12వేల నుంచి రూ.16వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి కలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంగారెడ్డిలోని ఉపాధి కార్యాలయ ప్రాంగణం(పాత వెలుగు ఆఫీసు, బైపాస్‌రోడ్డు)లో రేపు ఉదయం 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హాజరు కాగలరన్నారు. జాబ్‌మేళాకు వచ్చేవారు ఎస్ఎస్సి, ఆధార్, క్యాస్ట్ ఒక సెట్ జిరాక్స్ తీసుకుని రావాలని కోరారు. మరిన్ని వివరాలకు 08455-271010ను సంప్రదించాలన్నారు.

నూతన డీజీపీకి శుభాకాంక్షలు తెలిపిన గిరిధర్‌రెడ్డి

నవతెలంగాణ-జహీరాబాద్



రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన డా.జితేందర్‌ను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో యన్.గిరిధర్‌రెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.శాంతిభద్రతల రక్షణకు పూర్తిస్థాయిలో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని హెూతి(కె)లో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదు, ఆరు, ఏడు తరగతుల్లో కొన్ని ఖాళీలు ఉన్నాయని పాఠశాల ప్రిన్సిపల్ బి విజయ తెలిపారు. వాటికి ఈనెల 12న ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 15వ తేదీన పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లను కేటాయింస్తామన్నారు. ఈ చదవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈనెల 12న ఉపాధి హామీ సామాజిక తనిఖీ నివేదిక

నవతెలంగాణ-వట్‌పల్లి

మండలాభివృద్ధి కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ నివేదిక ప్రజాదర్బార్‌ను రేపు(శుక్రవారం) నిర్వహించనున్నట్టు ఎంపీడీవోఒక ప్రకటనలు తెలిపారు. గతేడాది ఏప్రిల్ 23 నుంచి.. ఈ ఏడాది మార్చి 31 వరకు గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులపై ఈనెల రెండు నుండి 11 వరకు సామాజిక తనిఖీ బృందం రికార్డులను తనిఖీ చేస్తున్నదన్నారు. తుది నివేదిక ఈనెల 12న ప్రజాదర్బార్‌లో వివరాలను వెల్లడిస్తూ సమర్పించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాలకు చెందిన ఉపాధి హామీఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొనాలన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని.. ఎన్‌టీఏను రద్దు చేసి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. కాగా పోలీసులు పీడీఎస్‌యూ నాయకులను అరెస్టు చేసి స్టేషన్ తరలించారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు సందీప్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్లు, రియంబర్స్మెంట్ రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రూ.8000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే వాటిని విడుదల చేయాలన్నారు. ఎన్‌టీఏను రద్దు చేసి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలన్నారు. పేపర్ లీకేజీకి కారణమైన వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల పక్షాన ఆలోచించి ఈ సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో రాబోవు రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమాలకు సంసిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వంశీ, సిద్దేశ్వర, బన్నీ దుర్గాప్రసాద్ , శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఊరడమ్మ బోనాల ఊరేగింపు

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని రేజింతల్ గ్రామంలో ఊరడమ్మ బోనాల ఊరేగింపు బుధవారం కన్నుల పండుగ్గా జరిగింది. భక్తిశ్రద్ధలతో మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి.. స్వామివారి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రేజింతల్ గ్రామంలోని వీధుల గుండా ఆలయం వరకు డప్పు చప్పులతో.. పోతురాజుల విన్యాసాలతో, ఆటాపాటలతో వైభవంగా బోనాల పండుగ జరిగింది. వర్షాలు బాగా కురిసి.. రైతులు పాడి పంటలతో విరాజిల్లాలని దేవతను వేడుకున్నారు.

ప్రభుత్వానికి కార్మికుల డిమాండ్స్..

జిల్లా వ్యాప్తంగా ఉధృతంగా సాగిన డిమాండ్స్ డే..

నవతెలంగాణ-సంగారెడ్డి

సీఐటీయూ ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా బుధవారం డిమాండ్స్ డే నిర్వహించారు. కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని.. పలు డిమాండ్స్‌ను ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. అంతేకాకుండా వెంటనే కార్మిక వర్గ డిమాండ్స్‌ను పరిష్కరించాలని.. లేని యెడల ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా ఉధృతంగా సాగింది. పెద్ద ఎత్తున కార్మికులు ధర్నాలో పాల్గొని.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డీఆర్‌ఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపి ప్రభుత్వం మూడోసారి అధికారులకు వచ్చిన తరువాత సంస్కరణలు, ప్రైవేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు ముందుకు పోతున్నదన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈపీఎఫ్ సకాలంలో చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానాను భారీగా తగ్గించిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించేందుకు కార్మిక వర్గ పోరాటాలు ఉధృతం చేయడానికి జులై 10న దేశవ్యాప్తంగా కోరికల దినం పాటిస్తున్నట్టు చెప్పారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26000 నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు ఎగ్జాంను రద్దుచేసి పారితోషికాలు కాకుండా కనీస వేతనాలు నిర్ణయించాలని, అంగన్వాడి, మధ్యాహ్నం భోజనం, ఐకెపి వివోఏ, వైద్య ఆరోగ్య రంగం తో పాటు వివిధ స్కీం లలో పనిచేస్తున్న స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాలు అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న అమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయ కులు శ్రీధర్, రాజు, రాజేశ్వర్, మల్లేశం, వేణు, నర్సింలు, సువర్ణ వరలక్ష్మి, వీరమని, సంగీత, మంజుల, రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట : స్థానిక సీఐటీయూ ఆఫీస్ నుంచి తహసీల్దార్ ఆఫీస్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ పభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినాక కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదన్నారు. పూర్తిస్థాయి మెజార్టీ లేకున్నా సంకీర్ణ ప్రభుత్వంలో కూడా పెట్టుబడుదారులు సంక్షేమానికే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ఐటీ రంగంలో నాలుగేండ్ల వరకు ఎలాంటి కార్మిక చట్టాలు వర్తించవని కేంద్ర ప్రభుత్వం జీ.వో జారీ చేయడం చాలా దుర్మార్గమ న్నారు. ఈ కార్యక్రమంలో పెబ్ పెన్నర్ పరిశ్రమ యూనియన్ నాయకులు మల్లేష్, శ్రీనివాస్, బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమ యూనియన్ నాయకులు శ్రీనివాస్, జనార్ధన్, సంజీవ రావు, అంగన్వాడి యూనియన్ నాయకులు మంజుల ఇందిరా, లక్ష్మి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు యశోద, లావణ్య మున్సిపల్ యూనియన్ నాయకులు మనీష్, రవి, శ్రీను, అంజయ్య గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు దశరథ్, శేఖర్, యాదమ్మ, సంజీవులు, బస్సు డ్రైవర్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, ఎండి మైబూబ్, డివైఎఫ్ఐ నాయకులు అనిల్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, మున్సిపల్, అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం.. సంస్కరణలు, ప్రైవే టీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేయాలని చూ స్తోందన్నారు. ఇప్పటికే నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని ప్రకటించినట్టు గుర్తు చేశారు. ఇప్పటికైనా కేంద్ర బీజేపీ సర్కార్ కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. క కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ స్కీమ్స్‌లో పనిచేస్తున్న వర్కర్లను కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాలు అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు చంద్రకళ శకుంతల, సుశీలమ్మ, లక్ష్మి ఏసురవి, అంగన్వాడి టీచర్స్ నాగేశ్వరి అనురాధ, పార్వతీ, సరళ, స్వరూప, మంగళ, శాంతమ్మ, ప్రభావతి, సుశీల, వీరమని, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ : డిమాండ్స్ డేలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం.. సంస్కరణలు, ప్రయివేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు అడుగులు వేస్తున్నదన్నారు. అందులో భాగంగానే నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని ప్రకటించిందన్నారు. బొగ్గు బ్లాకుల వేలానికి పూనుకున్నదన్నారు. ఈపీఎఫ్ సకాలంలో చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానాను కూడా భారీగా తగ్గించిందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.26000 నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ వివిధ రంగాల నాయకులు నందమ్మ, యశోదమ్మ, శశిరేఖ, సంజీవ్, మోహన్ తదితరులున్నారు.

తహసీల్దార్ కార్యాలయంతో పాటు మహీంద్రా అండ్ మహీంద్రా, మహీంద్రా ట్రాక్టర్స్, తదితర పరిశ్రమల వద్ద కూడా నిరసనలు జరిగాయి. కార్యక్రమాల్లో నాయకులూ రాజిరెడ్డి, గణేష్, సందీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వట్‌పల్లి : మండల కేంద్రంలో ఆశాలు, అంగన్వాడీల ఆధ్వర్యంలో కోరికల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ గంగామణి మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదన్నారు. ఇప్పటికైనా కార్మిక సంక్షేమానికి రూ.26వేల కనీస వేతనం చెల్లించాలన్నారు. లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

జోగిపేట : జోగిపేటలో సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి.. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా సీఐటయూ అందోల్ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్ మాట్లాడుతూ.. స్కీమ్ వర్కర్ల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరి వీడనాడాలన్నారు. కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుంటూ శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు చెల్లించాలని.. ఆశా వర్కర్లకు ఎగ్జామ్స్ పెట్టే విధానం రద్దుచేసి ఏఎన్ఎంతో సంబంధం లేకుండా పారితోషికాలు చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ. 3వేల వేతనంతో పనిచేస్తున్నారన్నారు. కార్మిక సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ప్రభాకర్, నాగేందం రెడ్డి,సురేష్, ఇందిర, షేకమ్మ,శోభారాణి,శిరీష, పాల్గొన్నారు.

ఐడీఏబొల్లారం : బొల్లారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజు,సురేందర్ రెడ్డి,ముత్యాలు, గొట్టయ్య, జీతయ్య,దశరథ, దశరథ, మల్లేష్, యాదగిరి, గోపాల్, నర్సింహులు యాదయ్య, స్వరూప, స్వామి, శాంతమ్మ లక్ష్మి, రాజేశ్వరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

కాజిపల్లి, బొల్లారం, బొంతపల్లి ప్రాంతాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బొంతపల్లిలోని న్యూ ల్యాండ్ పరిశ్రమ, కాజిపల్లిలోని టిఐడిసి పరిశ్రమ, బొల్లారంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద వివిధ కేంద్రాల్లో నిరసనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో శ్రీధర్ రావు, వెంకటేష్,నరసింహ గౌడ్, భాస్కర్ రెడ్డి, శేఖర్, సత్తయ్య, సురేందర్‌రెడ్డి, ముత్యాలు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు : మండలంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో సీఐటీయూ పాశమైలారం క్లస్టర్ కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు శాంతకుమార్ శాంతకుమార్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కనీస వేతనాలను అమలు చేయాలని, ప్రైవేట్ విధానాన్ని ఉప సంహరించాలని, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని, కార్మిక సమస్య లను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఎస్ రాజు, ప్రధాన కార్యదర్శి సంతోష్, హరినాథ్, సీఐటీయూ నాయకులు ఏడుకొండలు, శ్రీనివాసు, నాగప్రసాద్, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరులోని అంబేద్కర్ విగ్రహం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.పాండు రంగారెడ్డి, బి.నాగేశ్వర్రావులు మాట్లాడుతూ.. కేంద్రలో మూడోసారి అధికారంలోకి వచ్చాక సంస్కరణలను, ప్రైవేటీకరణ విధానాలను బీజేపీ సర్కార్ మరింత వేగవంతం చేస్తున్నదన్నారు. ఈపీఎఫ్ సకాలంలో చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానాను భారీగా తగ్గించిందన్నారు. కార్పొరేట్ శక్తులకు లాభాలను కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికైనా కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మని రాజు, మూర్తి, సురేష్, ఏసుమని,మంజుల, హైమవతి, గీతారామకృష్ణ, వైష్ణవి, శివరాజ్ పాల్గొన్నారు.

చౌటకూర్ : మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్స్ డే సందర్భంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఏ.నాగభూషణం మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని.. నేషనల్ మనీ ట్రైజేషన్ పైప్‌లైన్ రద్దు చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని.. బొగ్గు బ్లాక్‌ల వేలంను నిలుపుదల చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. ఆశా వర్కర్లకు పరీక్షలు రద్దు చేయాన్నారు.కార్యక్రమంలో ఆశా నాయకురాలు సువర్ణ, సునీత, స్వరూప, లక్ష్మి, లావణ్య రేష్మ, ప్రజానాట్యమండలి మండల నాయకులుసత్యనారాయణ, మల్లేశం, భుజంగం, గంగరాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్హేర్ : మండల కేంద్రమైన సిర్గాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నారాయణఖేడ్ ఏరియా కార్యదర్శి నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ.. ఆశా కార్యకర్తలు అంగన్వాడీ కార్యకర్తలు తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ కల్పించి రిటైర్మెంట్ పెన్షన్ వర్తింప చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని.. అంగన్వాడీ టీచర్స్‌ను మూడో తరగతి హెల్పర్స్‌ను నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలన్నారు. టీచర్స్ హెల్పర్స్ మరియు స్కీమ్ వర్కర్ల అందరికీ వెంటనే పే కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భారతి, లక్ష్మీ, సరిత, సురేఖ, తులసి, సుజాత ,సరోజన, అంబికా, నాగమణి, హేమలత, స్వప్న ,కనకదుర్గా, కళావతి, సాయమ్మ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఝరాసంగం : మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులతో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ముందుగా తాసిల్దార్ ఎంపీడీవో కార్యాలయాలు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి చంద్రన్న మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించు కోవాలని, గతంలో పార్లమెంటులో ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 చెల్లించాలని, బొగ్గు గనుల వేలం ఆపాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం : మండలంలోని పారిశ్రామిక ప్రాంతాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. కేంద్ర బీజేపీ సర్కార్ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వీడనాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్మిక సంఘాల నేతలు శ్రీధర్‌రావు, వెంకటేష్ ,నరసింహ గౌడ్,భాస్కర్ రెడ్డి, శేఖర్, సత్తయ్య, సురేందర్ రెడ్డి, ముత్యాలు, సుజాత తదితరులు పాల్గొన్నారు.
















కాలుష్యం నుంచి విముక్తి కల్పించాలి

నవతెలంగాణ-జిన్నారం



మండల పరిధిలోని కాజిపల్లి గ్రామానికి కాలుష్యం నుంచి విముక్తి కల్పించాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి కాలుష్య నివారణ నివారణ పోరాట సమితి జేఏసీ నేత అడ్వకేట్ దండే రమాకాంత్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ప్రత్యేకంగా ఓ వినతి పత్రాన్ని అందజేశారు. మండల పరిధిలోని అనేక పారిశ్రామికవాడల్లోని వివిధ పరిశ్రమల విచ్చలవిడిగా రసాయన కాలుష్యాన్ని వదు లుతుండడంతో.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నార న్నారు. ప్రజలు తరచూ అనారోగ్యానికి గురవు తున్నారని వాపోయారు. కాబట్టి వెంటనే కాలుష్య సమస్యను పరిష్కరించి.. కాలుష్య కారకులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బొల్లారం ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి ఖాజీపల్లి గ్రామం వరకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని, ఖాజీపల్లి గాంధీ విగ్రహం నుంచి ఎస్సీ కాలనీ అంబేద్కర్ విగ్రహం వరకు రోడ్డు వేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

గ్రామ రెవెన్యూ వ్యవస్థను ప్రవేశపెట్టాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



గ్రామ రెవెన్యూ వ్యవస్థను ప్రవేశపెట్టాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు వీఆర్వోలు బుధవారం వినతి పత్రం అందజేశారు. వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీఆ ర్వో వ్యవస్థను ప్రవేశపెట్టాలని ఎమ్మెల్యేను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే. తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ అంజన్ కుమార్, ట్రెజరీ విటల్, మధు, ఆంజనేయులు, చంద్రశేఖర్, ఆనందం, నాగరాజు , సాత్విక్, శివరామ్, కరీన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వంలో నాలుగు సబ్ స్టేషన్‌లు 5 ఎంవిఏ/33 /11 కె.వి కెపాసిటీలతో మంజూరు అయ్యాయని గుర్తు చేశారు. సబ్ స్టేషన్‌ల పురోగతిపై విద్యుత్‌శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సదాశివపేటలో రూ.1.27కోట్లు, పెద్దాపూర్‌లో రూ.1.27 కోట్లు, ఆరుట్లలో రూ.1.50 కోట్లు, రాజంపేటలో రూ.1.53 కోట్లతో 4 సబ్‌స్టేషన్‌ల నిర్మాణం జరుగుతుందన్నారు. అయితే వారం రోజుల్లో నిధులు మంజూరు అవుతాయని.. పనులు ప్రారంభిస్తామని విద్యుత్ అధికారులు ఎమ్మెల్యేకి తెలిపారు. పొలాల వద్ద వంగిన స్తంభాలు, వంగిన వైర్లను గుర్తించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాల వల్ల విద్యుత్ సౌకర్యానికి ఇబ్బందులు వస్తే వెంటనే పునరుద్ధరించాలని చెప్పారు. గాలి వానల వల్ల స్తంభాలు తీగలు తెగిపోతే గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరాను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ రామప్ప, మాజీ ఎంపీటీసీ సంతోష్‌రెడ్డి, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడంలో విఫలం..

నవతెలంగాణ-పుల్కల్



ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నిలబెట్టుకోలేదని బీజేపీ మండల అధ్యక్షులు కుమ్మరి పాండరీ ఆరోపించారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం పాండరీ మాట్లాడుతూ.. రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఏ ఒక్క రైతుకు రుణమాఫీ చేసి నాపాపాన పోలేదన్నారు. గత ఎన్నికల్లో రాజకీయలబ్ధి కోసం సాధ్యం కానీ హామీలు ఇచ్చి.. అమలు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలను అమలు చేయాలన్నారు. లేనియెడల పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

పల్లెల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం

పనులను పర్యవేక్షించిన ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు

నవతెలంగాణ-కొల్చారం



మండలంలోని రాంపూర్, చిన్న ఘనపూర్, సంగాయిపేట గ్రామాల్లో బుధవారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగాయి. పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు ఆయా పంచాయతీ కార్యదర్శులతో సమీక్షలు నిర్వహిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారు. వర్షాకాల దృష్ట్యా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వాటర్ ట్యాంకులు, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పర్యటించి పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు ఉన్నారు.

గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఉప్పల ప్రవీణ్

నవతెలంగాణ- జగదేవ్‌పూర్



జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఉప్పల ప్రవీణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తిగుల్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా తనను ఎన్నుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మహేందర్ రెడ్డి, తిగుల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గ్రామ కమిటీ యూత్ అధ్యక్షుడిగా కరుణాకర్, మైనారిటీ అధ్యక్షుడిగా కుద్దుస్ లను ఎన్నుకున్నారు.

రామాయంపేట కాంగ్రెస్‌లో గ్రూపుల రచ్చ

- కుంటలు కబ్జా చేశావంటే.. అమ్ముడు పోయావంటు..
- ఒకే పార్టీలోని వారు పరస్పర విమర్శలు
- కాంగ్రెస్ పార్టీ గ్రూపుల లొల్లి వల్లే ఎమ్మెల్యే రావడం లేదా..?
- ప్రజా సమస్యలు పక్కదారి పట్టించేందుకేనా..?

నవతెలంగాణ-రామాయంపేట

ఒకే పార్టీలో ఉంటూ ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ, విమర్శలు-ప్రతి విమర్శలు చేసుకుంటూ బజారున పడ్డారు. రామాయంపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ గ్రూపుల రొచ్చును ప్రజలకు రుద్దుతున్నారు. పట్టణంలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తారని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే, నిత్యం పత్రికల్లో, స్థానిక సోషల్ మీడియా గ్రూపులలో, యూట్యూబ్ చానల్లలో కాంగ్రెస్ పార్టీ గ్రూపు నాయకుల లొల్లి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఎంతో కాలంగా పట్టణంలో నెలకొని ఉన్న సమస్యలు చర్చకు రాకుండా పక్కదారి పడుతున్నాయి.

కబ్జాలు చేసావంటే.. అమ్ముడుపోయావ్ అంటూ..

ఎంతో కాలంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీలో ఉన్న గ్రూపుల లొల్లి ఈ మధ్య కాలంలో తీవ్ర స్థాయిలో బయటపడ్డాయి. కాంగ్రెస్ పార్టీలో ఏ పదవి లేకపోయినా, రాష్ట్ర స్థాయి పదవి ఉందని చౌదరి సుప్రభాత రావు చెలామణి అవుతున్నాడని కొంతకాలంగా పల్లె రామచందర్ గౌడ్ విమర్శిస్తూ వస్తున్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పి కొందరు కాంగ్రెస్ నాయకులు చెరువులో మట్టి అమ్ముకుంటున్నారంటూ, కాంగ్రెస్ పార్టీలోని ఓ నాయకుని గ్రూపుగా భావిస్తున్న కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు రెండు మూడు రోజులు రచ్చ చేశారు. గత కొన్నేళ్ళుగా వివాదాస్పద విషయంగా చర్చలో ఉన్న కస్నోనికుంట కబ్జా విషయాన్ని రామచందర్ గౌడ్ ముందుకు తెచ్చారు. అప్పటి ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డికి చౌదరి సుప్రభాతరావు తొత్తుగా వ్యవహరించి, కస్నోని కుంట కబ్జా చేశారని, అక్కడ ఏకంగా అపార్ట్మెంట్ కట్టారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు 5 లక్షలకు బేరం చేసుకొని, బీఆర్ఎస్ పార్టీలో చేరడానికి సిద్ధమై, దేవేందర్ రెడ్డి వ్యతిరేకించడంతో తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చాడని ఆరోపిస్తూ, కాంగ్రెస్ పార్టీ మరో గ్రూపుగా భావిస్తున్న కాంగ్రెస్ నాయకులు స్థానిక వాట్సప్ గ్రూపులలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే టిక్కెట్టు రాలేదని వ్యతిరేకించి, బీఆర్ఎస్ పార్టీలో చేరిన కంఠారెడ్డి తిరుపతి రెడ్డికి, ఎన్నికల సమయంలో లీకులు ఇచ్చి పార్టీ ఓటమి కోసం పని చేశారని, త్వరలో ఆడియో రికార్డులు, కాల్ రికార్డులు బయట పెడతామని పోస్టులు పెట్టారు.

పక్క పార్టీ వాళ్లపై కాంగ్రెస్ అధిష్టానం రుసరుసలు..?

గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీలోని గ్రూపులలో కోల్డ్ వార్ నడుస్తుంటే, వాళ్లని కట్టడి చేయలేని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పక్క పార్టీ వాళ్లకు ఫోన్‌లు చేసి దురుసుగా మాట్లాడుతున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీలోని గ్రూపుల మధ్య ఉన్న గొడవలోకి, కంటారెడ్డి తిరుపతిరెడ్డికి లీకులు ఇస్తున్నారంటూ, తమ నాయకుడిని ఎందుకు మధ్యలోకి తెస్తున్నారని, ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కంటారెడ్డి అభిమానులు తీవ్రస్థాయిలో స్పందించారు. పక్క పార్టీ నుంచి లీకులు తీసుకొని చిల్లర రాజకీయాలు చేయాల్సిన అవసరం మాకు లేదని, అధారాలుంటే బయట పెట్టాలని తీవ్రస్థాయిలో డిమాండ్ చేశారు. తమ పార్టీ వాళ్లను అదుపులో పెట్టుకోవాల్సిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేత, మైనంపల్లి హనుమంతరావు బావమరిదిగా చెప్పుకొని, బీఆర్ఎస్ పార్టీకి చెందిన రొయ్యల హరి ప్రసాద్ అనే వ్యక్తికి ఫోన్ చేసి దురుసుగా మాట్లాడాడని, హరిప్రసాద్ సోషల్ మీడియా గ్రూపుల పోస్ట్ చేశాడు. సొంత పార్టీ నాయకులను గాడిలో పెట్టడం చేతగాని కాంగ్రెస్ నాయకులు, పక్క పార్టీ వాళ్లకు ఫోన్లు చేసి దురుసుగా మాట్లాడడమేమిటనే చర్చ నడుస్తుంది.



పార్టీ గ్రూపుల లొల్లి వల్లే ఎమ్మెల్యే రావడం లేదా..?

గత కొంతకాలంగా రామాయంపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ఉన్న గ్రూపు తగాదాల వల్లే ఎమ్మెల్యే రోహిత్ రావు రామాయంపేటకు సరిగ్గా రావడంలేదని కొందరు తటస్థంగా ఉన్న కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. గ్రూపుల మధ్య తగాదాలను పరిష్కరించాల్సింది పోయి, ఓట్లేసిన జనానికి దూరంగా ఉండడం ఎంతవరకు సబబు అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రామాయంపేట పట్టణంలో మురికి కాలువలు లేక, అధ్వానంగా మారిన అంతర్గత రోడ్లతో, ఇతర ఎన్నో సమస్యలతో ప్రజలు నానా అవస్థలు పడుతుంటే, సమస్యలపై చర్చ జరగకుండా, గ్రూపు తగాదాల చర్చతో కాలం వెల్లదీస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు

నవ తెలంగాణ - నర్సాపూర్



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోరికల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నర్సాపూర్‌లో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కడారి నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని మండిపడ్డారు. కార్మికుల పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను తొలగిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ, మున్సిపల్ జిల్లా అధ్యక్షులు పుష్ప , కార్మికులు అశోక్, శంకర్, అనిత, రాములు, శంకరయ్య నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వనమహొత్సవంపై మున్సిపల్ సాధారణ సమావేశం

నవతెలంగాణ-తూప్రాన్



మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం రోజున ఉదయం 10 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ అధ్యక్షతన సాధన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్ పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహొత్సవ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాట్లతో పాటు పలు విషయాలను చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్, కౌన్సిలర్లు శ్రీశైలం గౌడ్, నారాయణ, భగవాన్ రెడ్డి, ప్రియాంక, మున్సిపల్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

నవతెలంగాణ-తూప్రాన్



డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలియజేయాల్సిందిగా తూప్రాన్ రెవెన్యూ డివిజనల్ అధికారి జయచంద్రారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. డిమాండ్స్ డే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి ఆర్‌డీఓ జయచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.యాదగిరి, డి.స్వామి, జి.మహేష్ జి.సరిత,సిహెచ్ మల్లమ్మ తదితరులు వినతి పత్రం అందజేశారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన తహశీల్దార్ సురేష్ కుమార్

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని మండల తహశీల్దార్ సురేష్ కుమార్ బుధవారం పరిశీలించారు. వంట చేసే ప్రాంతానికి పిల్లలు ప్లేట్లు కడిగే నీరు వచ్చి చేరుతుందని, అక్కడ ఇంకుడు గుంత కట్టే ఏర్పాటు చేయాలని తహశీల్దార్ ను వంట వండే మహిళలు కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ వెంటనే ఇంకుడు గుంత కట్టించే ఏర్పాట్లు చేయిస్తానని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మంచిగా రుచికరంగా వండి పెట్టాలన్నారు. వంట సామాగ్రి పైన మూతలు జాగ్రత్తగా పెట్టాలని, వర్షాకాలం వచ్చినందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెను ప్రకారం వంటలు రుచికరంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గంగాధర్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



నవతెలంగాణ-నర్సాపూర్

హత్నూర మండల పరిధిలోని గోవింద్ రాజ్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్‌ల ఆధ్వర్యంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు

నవతెలంగాణ-పెద్దశంకరంపేట్



ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు, ప్రమోషన్‌లో భాగంగా ప్రాథమిక పాఠశాల బాలుర పెద్ద శంకరం పేటలో ఎస్జిటి నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందిన శంకర్, సిద్దిరాములు, ప్రమోద్ కుమార్‌లకు విద్యార్థులు, ఉపాధ్యాయులు వీడ్కోలు పలికారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-పెద్దశంకరంపేట్



161 జాతీయ రహదారిపై పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కోలపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అల్లాదుర్గం మండలం అప్పాజీ పల్లి తండా కు చెందిన వడిత రమేష్ (28) తన ద్విచక్ర వాహనంపై పెద్ద శంకరంపేటకు వస్తుండగా హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్‌కి వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో వడిత రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన విషయం తెలిసిన వెంటనే ఏఎస్ఐ విఠల్ పోలీస్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

మృతుడి కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ-చిలిపిచేడ్



మండల కేంద్రంలో ఎరుకల పెంటయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మండల ఎరుకల కుర్రు సంఘం తరపున రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని ఆ కుటుంబానికి అందజేశారు. అనంతరం సంఘం ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ తమ సంఘంలో ఎవరు మరణించినా వారి కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని సంఘం అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎల్లదాసు, ప్రధాన కార్యదర్శి బిక్షపతి పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్స్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

నవతెలంగాణ-మెదక్ టౌన్



కేంద్ర బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ "కార్మికుల కోర్కెల దినం" మెదక్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. మెదక్ పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ మెదక్ జిల్లా నాయకులు సంతోష్ మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా గత పదిహేళ్లుగా సాధించిన సంస్కరణలు, ప్రైవేటీ కరణ విధానాలను వేగవంతం చేసేందుకే ఉవ్విళ్లూరుతుందన్నారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకే లాభాలు చేకూర్చే విధంగా బీజేపీ విధానాలు ఉన్నాయన్నారు. కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తామంటుందన్నారు. ఇప్పుడు సింగరేణి బొగ్గు బ్లాక్‌ల వేలానికి, ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ లీజుకివ్వడం, అమ్మేయడం, ప్రైవేటీకరణ చేయడం లాంటి వేగవంతమైన పనులను కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకలనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. రాష్ట్రంలో కూడా లేబర్ కోడ్లను అమలు చేస్తామని పత్రికలకు లీకులిస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సిహెచ్ లచ్చ గౌడ్, సత్యం, స్వప్న, లలిత, దుర్గాబాయి, సావిత్రి, అనసూయ, స్వరూప, ఆశ వర్కర్లు అంగన్వాడీ వర్కర్లు, పాల్గొన్నారు

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా ఆశా వర్కర్ల సంఘం అధ్యక్షురాలు సావిత్రి అన్నారు. కార్మికుల కోర్కెల దినం' సందర్భంగా బుధవారం ఘనపూర్ మండల కేంద్రం చౌరస్తా వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల జిల్లా అధ్యక్షులు సావిత్రి మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా గత పదిహేళ్లుగా సాధించిన సంస్కరణలు, ప్రైవేటీ కరణ విధానాలను వేగవంతం చేసేందుకే ఉవ్విళ్లూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు సంతోష్ కుమార్, నాయకురాలు స్వప్న, లలిత, దుర్గాబాయి, సావిత్రి, అనసూయ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ -నర్సాపూర్

కేంద్ర ప్రభుత్వం కార్మికుల డిమాండ్స్‌ను వెంటనే పరిష్కరించాలని శివంపేట మండల కార్యదర్శి శంకర్ అన్నారు. బుధవారం కార్మికుల కోరికల దినోత్సవం పురస్కరించుకొని శివంపేట మండల కేంద్రంలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులను అణిచివేసే దిశగా పనిచేస్తుందన్నారు. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు వెంకటేష్, బాలకృష్ణ, భాస్కర్, కృష్ణ, వసంత, ఆశ వర్కర్లు గోపమ్మ, రేణుక, మాధవి, వరలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

నవతెలంగాణ-మనోహరాబాద్

కేంద్ర బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు ఆసిఫ్ డిమాండ్ చేశారు. బుధవారం "కార్మికుల కోర్కెల దినం" సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డికి కార్మికులతో కలిసి అందజేశారు . ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు అసిఫ్ మాట్లాడుతూ... కొత్తగా ఏర్పడిన కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, స్వామి, మహేష్, సురేష్, సరిత, మల్లమ్మ పాల్గొన్నారు.







కార్మికుల హక్కుల సాధనకై సీఐటీయూ పోరాటం

- సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత

నవతెలంగాణ- కొల్చారం



కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని సీఐటీయూ మండల నాయకురాలు సబిత, రాములమ్మ కవితలు అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్చారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో డాక్టర్ రమేష్ కు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసి నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశా వర్కర్లకు పరీక్షలు రద్దుచేసి పారితోషికాలు కాకుండా కనీస వేతనాలు నిర్ణయించాలని, అంగన్వాడి, మధ్యాహ్న భోజనం, ఐకెపి వివోఏ, వైద్య ఆరోగ్య రంగం తో పాటు వివిధ స్కీం లలో పనిచేస్తున్న స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాలు అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశా కార్యకర్తలు మంజుల, సుగుణ, శ్యామల, నవనీత, లక్ష్మి, మంజుల, చంద్రకళ, గ్రామపంచాయతీ నాయకులు మల్లేశం, శేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో పెరుగుతున్న విద్యాప్రమాణాలు

నవతెలంగాణ- మెదక్ టౌన్



ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్‌లో బుధవారం నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే హుస్సేన్ తెలిపారు. ఈ సమావేశంలో కళాశాలలో ఉన్న వివిధ వసతులను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించడంతో పాటు కళాశాల అకాడమిక్ కార్యక్రమాలను తెలియజేశారు. కళాశాల ఈ సంవత్సరం స్వయం ప్రతిపత్తిని, వచ్చే సంవత్సరం న్యాక్ అక్రిడిటేషన్‌కు పోతున్న శుభసందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజశారు. ఈ సమావేశంలో అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆకుల సుధాకర్ మాట్లాడుతూ కళాశాలలో ఉన్న విద్యా పరమైన అవకాశాలు ప్రణాళికలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించారు. ఐ.క్యూ. ఏ.సీ. కో ఆర్డినేటర్ డాక్టర్ తిరుమలరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో ఉన్న మెరుగైన సదుపాయాలు, నిర్వహించబోయే కార్యక్రమాలను వివరించారు. త్వరలో నిర్వహించబోయే బ్యాంకింగ్ జాబ్ మేళా తదితర విషయాలను విభాగాధిపతి డాక్టర్ బి శరత్ రెడ్డి వివరించారు. కళాశాల కలిగించే ప్రోత్సాహాలను, గత సంవత్సరం సాధించిన వివిధ బహుమతులను సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ వామన మూర్తి వివరించారు. కళాశాలలో ఉన్న జిమ్, స్పోర్ట్స్ సౌకర్యాలను ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఇంచార్జ్ పి వెంకటేశ్వర్లు వివరించారు. ఇంటర్వ్యూకు తయారు చేయడానికి విద్యార్థులకు మెలకువలు నేర్పే టిఎస్‌కేసి కార్యక్రమాలను కోఆర్డినేటర్ వై ప్రవీణ్ కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సింహా రెడ్డి, డాక్టర్ దినకర్, వెంకటేశ్వర్లు, డా.విశ్వనాథం, రాజు, మురళి, వేణుగోపాల శర్మ, డా కిరణ్ కుమార్, కాశీ విశ్వనాథ్, నరేష్, సుధారాణి, నిదర్శిని పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



నవతెలంగాణ-కోహెడ

ప్రభుత్వ పాఠశాలలోనె నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహమూద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీలో వెళ్తున్న కొండూరి రామకృష్ణ, బొద్దుల శ్రీరాములు, భైరి మనోహర్, పుల్లూరి విజయలక్ష్మిలను ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అంకితభావంతో కూడిన విద్య నేర్పబడుతుందన్నారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రానున్న రోజుల మంచిపేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.నగేష్, కె.ఓదెలు, సంపత్, సద్గుణాచారి, రమేష్, అబ్దుల్ హమీద్, రవీందర్, దెవేందర్, రాజమౌళి, రమణ, గీత, సురేష్‌కుమార్, పుష్పలత, ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు సీఎం ఇస్తారు

నవతెలంగాణ- గజ్వేల్



ఉమ్మడి మెదక్ జిల్లాలో గ్రామపంచాయతీలకు, ఇతర పనులకు పెండింగ్లో ఉన్న బిల్లులను సీఎం రేవంత్ రెడ్డి దశలవారీగా చెల్లిస్తారని డీసీసీబీ మాజీ చైర్మన్ గంగుమళ్ల ఎలక్షన్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మున్సిపల్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ... అభివృద్ధి పనులు కొనసాగించాలని బిల్లులు పెండింగ్లో లేకుండా ప్రభుత్వం చూస్తుందన్నారు. బిల్లులు రావని అభివృద్ధి పనులు ఆపకూడదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా గజ్వేల్ నియోజకవర్గంలో కొన్ని పనులు నిలిచిపోగా వాటిని కొనసాగించేందుకు సీఎం రేవంత్ రెడ్డి దృష్టి పెట్టినాడని స్పష్టం చేశారు. రాజకీయాల కోసం తాను పనిచేయడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా సీఎం రేవంత్ రెడ్డి తీసుకపోతున్నారని పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గం లో డీసీసీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు తో కలిసి గజ్వేల్ అభివృద్ధిని మరింత సాధించేందుకు కృషి చేస్తున్నామని ఇందులో భాగాంగానే గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. కొందరు రాజకీయాల కోసం డ్రామాలాడుతున్నారని విమర్శించారు. తను 40 ఏళ్ల రాజకీయాల్లో కొందరు మూలంగా గాంధీ భవన్‌కు వెళ్లక తప్ప లేదన్నారు.



ఎంపీకి జ్ఞాపిక బహుకరణ

నవ తెలంగాణ -దుబ్బాక

ఎంపీగా గెలిచి తొలిసారిగా దుబ్బాక వచ్చిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావుకు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికి, జ్ఞాపికను బహుకరించారు. బీజేపీ దుబ్బాక మున్సిపల్ ఉపాధ్యక్షుడు మోత్కుపల్లి బద్రీనాథ్ ఆధ్వర్యంలో ఎంపీ రఘునందన్ రావును శాలువా కప్పి సత్కరించారు.అనంతరం జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.బీజేపీ దళిత మోర్చా మున్సిపల్ అధ్యక్షుడు కనకరాజు, మరాటి బాబు, బెల్లె సంజీవులు, యాదగిరి ఉన్నారు.

సంఘవిద్రహా శక్తులకు ఆలవాలమైన రైల్వే స్టేషన్

నవతెలంగాణ -గజ్వేల్



గజ్వేల్ రైల్వే స్టేషన్ సంఘవిద్రోహం ఆలవాలమై ఉందని గజ్వేల్ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు, రెండు తెలుగు రాష్ట్రాల లోక్‌సత్తా, సమన్వయకర్త బండారు రామ్మోహన్‌రావు అన్నారు. బుధవారం ప్రజ్ఞాపూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్ రైల్వే స్టేషన్ లో రేక్ పాయింట్ వద్ద నిలిచిన రైల్వే బోగీలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆవేదన చెందారు. పోలీసులు పక్కా నిఘా పెట్టాలని,నిఘా పెంచడం కాకుండా గస్తీలు నిర్వహించాలని కోరారు. ఈ విషయాన్ని సిద్దిపేట జిల్లా సీపీ దృష్టి సైతం తీసుకపోతానని పేర్కొన్నారు. గరీబ్ రథ్ రైలు భోగిలను తీసుకొచ్చి గజ్వేల్ స్టేషన్లో నెలల తరబడి ఉంచడం వల్ల అసాంఘిక కార్యక్రమాలకు బోగీలు నిలయంగా మారినట్టు అన్నారు. తాను రైల్వే స్టేషన్‌కు వెళ్ళినప్పుడు వ్యవసాయ ఎదారులు తన దృష్టికి తెచ్చినట్లు పేర్కొన్నారు.అదేవిధంగా కోట మైసమ్మ రోడ్డు నుంచి రైల్వే స్టేషన్‌కి వెళ్లే అప్రోచ్ రోడ్డు పూర్తిగా సర్కార్ ముండ్లకు నిలయం గాక స్వయంగా తానే తొలగించినట్లు పేర్కొన్నారు. రోడ్డు నిండా సర్కార్ ముళ్ళు ఉండటంతో రైల్వే స్టేషన్‌కి వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందని మున్సిపల్ శాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చినామన్నారు. అప్రోచ్ రోడ్ విషయంలో రైల్వే అధికారుల దృష్టికి తీసుకుపోయినామన్నారు. ఈ రోడ్డును సీసీ చేస్తే బాగుంటుందన్నారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ తో పాటు కమిషనర్ అప్రోచ్ రోడ్‌పై స్పందించి ముండ్ల పొదలను రోడ్డును శుభ్రం చేయాలని కోరారు. యువకులు, క్రియాశీల పౌరులు ఎప్పటికప్పుడు స్థానిక సమస్యలపై స్పందించినట్లయితే మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే రాజీనామా చేయాలి

నవతెలంగాణ-గజ్వేల్ : గజ్వేల్ ఎమ్మెల్యే మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని గజ్వేల్ మండల బీజేపీ ఉపాధ్యక్షులు బారు అరవింద డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ నమ్మి నీకు ఓట్లేసిన గజ్వేల్ ప్రజలను నట్టెట ముంచుతున్నావని విమర్శించారు. మూడుసార్లు ఓటేసిన పాపానికి గజ్వేల్ నియోజకవర్గం కనీసం కన్నెత్తి చూడడం లేదని ఆవేదన చెందారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి గజ్వేల్ ప్రజల సమస్యలను తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. క్యాంప్ ఆఫీస్‌కు రాని యెడల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని నిన్ను నమ్మి మూడుసార్లు ఓట్లు వేసి గెలిపించినట్లు మూడుసార్లు కూడా గజ్వేల్ ప్రాంతానికి రాలేకపోయినట్టు అన్నారు. రింగ్ రోడ్డు, కోట మైసమ్మ రోడ్డు, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని అంతర్గత రోడ్ల తో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిచి కొంత అభివృద్ధి చేసినప్పటికీ గజ్వేల్ ప్రాంతం రాకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి సత్కారం




నవతెలంగాణ-కొండపాక

10 వ తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కోనాయపల్లి గ్రామానికి చెందిన ముష్టం దీప్తిని ఆ గ్రామ మాజీ సర్పంచ్ మిట్టపల్లి రుషి బుధవారం ఘనంగా సత్కరించారు. అలాగే రూ.4వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించి 12 మంది విద్యార్థులు ట్రిబుల్ ఐటీ కి ఎంపిక అయ్యేలా కృషి చేసిన ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బచ్చలి సత్తయ్యను ఈ సందర్భంగా సత్కరించారు. పాఠశాలకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్న గ్రామ మాజీ సర్పంచ్ పొల్కంపల్లి జయంతి నరేందర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోనాయిపల్లి గ్రామ స్పెషల్ ఆఫీసర్ అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రియదర్శిని, పంచాయతీ సెక్రెటరీ కృష్ణ, ఉపసర్పంచ్ పిట్ల రమేష్, కో ఆప్షన్ ముష్టం ఉపేందర్ గౌడ్, నరేష్ గౌడ్, నరేష్, యాదవ్,సాయి రెడ్డి, ముష్టం స్వామి, రామస్వామి , మిట్టపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలిన

- ఎంపీడీవో



నవతెలంగాణ-మద్దూరు

మండల కేంద్రంలో జరుగుతున్న సామూహిక టాయిలెట్స్ నిర్మాణం పనులను మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల నుంచి మంజూరైన సామూహిక టాయిలెట్స్ నిర్మాణం పనులను పరిశీలించినట్టు తెలిపారు. త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించినట్టు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్లు లక్కిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, బూరుగు శంకర్ గౌడ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా ఫోటో కెమెరా సృష్టికర్త వర్ధంతి



నవతెలంగాణ-మద్దూరు

ఫోటో కెమెరా సృష్టికర్త లూయిస్ జాకస్ మండే డాగ్యురే, 173వ వర్ధంతి సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలో ఫోటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు .ఈ కార్యక్రమంలో మద్దూరు మండల ఫోటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల గౌరవ అధ్యక్షులు కొరిగింజ శేఖర్,ఉపాధ్యక్షులు దాసు మహేందర్, కోశాధికారి జగ్గని దయాకర్, సహాయ కార్యదర్శులు ఇప్పకాయల శ్రీకాంత్, పాకాల కిరణ్ కుమార్ లు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చే బాధ్యత సీఎం

- విద్యాసాగర్ ముదిరాజ్

నవతెలంగాణ-మిరుదొడ్డి

ఎన్నికల ముందు ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి పై ఉందని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు విద్యాసాగర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవాలయం వద్ద ముదిరాజ్ మహాసభ గోడపత్రిక ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ అధికారుల ద్వారా వినతి పత్రాలను అందిస్తామన్నారు. ముదిరాజులను బీసీడీ నుంచి బీసీలకు మార్చాలని డిమాండ్ చేశారు వాడితో పాటు మత్స్యకారుల అభివృద్ధి కోసం తెలంగాణ మత్స్యకార అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి వారికి ఆసరా పింఛన్ అందించేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. చేప పిల్లలకు 100 శాతం మత్స్యకారులకు సబ్సిడీ ఇచ్చే విధంగా ప్రభుత్వం కుర్చేయాలన్నారు. వారితో పాటు ముదిరాజ్‌లకు జనాభా ప్రాతిన ప్రకారం రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు మాజీ ఎంపీటీసీ గొట్టం బైరయ్య, తుమ్మల బాలరాజు, ప్రశాంతు, బోయిని ఎల్లం, గొట్టం ఎల్లం, కానుగంటి కోటి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

యాచకులకు చెద్దార్ల పంపిణీ



నవతెలంగాణ-సిద్దిపేట

వాసవి క్లబ్ వనిత వారి ఆధ్వర్యంలో వాసవి క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ పుల్లూరి శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహాయముతో శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయము వద్ద 10 మంది యాచకులకు చెద్దార్ల పంపిణీ చేసినట్లు వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు మర్యాల వాణి, పట్టణ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం అధ్యక్షురాలు పుల్లూరి సుష్మ, శ్రీనివాస్, మల్లేశం, వీరేశం, శ్రీనివాస్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ షాక్ తో పాడి ఆవు మృత్యువాత



నవతెలంగాణ-మిరుదొడ్డి

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై పాడి ఆవు మృత్యువాత చెందిన ఘటన మిరుదొడ్డి మండలంలో చోటుచేసుకుంది. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన గూల్ల లింగం తన వ్యవసాయ పొలం వద్ద ఆవులను మేత కోసం వదిలేశాన్నారు. కొద్ది దూరంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్దకు ఆవు వెళ్లడంతో విద్యుత్ షాక్కు గురి కావడంతో, ఆవు అక్కడికక్కడే మృత్యువాత పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.లక్ష విలువ గల ఆవు మృత్యువాత చెందిందని బాధిత రైతు లింగం వాపోయారు. విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి ఆవు పై ఉపాధి పొందే తనకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు. బాధ్యత కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు

తహసీల్దార్ కు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-జగదేవ్‌పూర్

జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో గల స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు మండల సఫాయి కార్మికులు బుధవారం పెండింగ్లో ఉన్న వేతనాల కోసం ధర్నా నిర్వహించి స్థానిక తాహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నుంచి ఆరు నెలల వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని మేము బ్రతికేది ఎట్లా అంటు ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి వారంలోని జీతాలు ఇచ్చుకుంటూ, పరిశుభ్ర గ్రామాలుగా కాపాడుతున్న సఫాయి కార్మికులకు మొండి చేయి చూపడం ఏంటని ప్రశ్నించారు. స్వచ్ఛ గ్రామాలుగా మారడం అంటే సఫాయి కార్మికులు పూర్తిస్థాయిలో పనిచేస్తేనే మారతాయని అన్నారు. వెంటనే పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించి సఫాయి కార్మికుల పట్ల తమకున్న చిత్తశుద్ధిని చాటుకోవాలని తెలిపారు.

నాణ్యతలేని ఆహారం..అపరిశుభ్రంగా హాస్టల్

-డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణ పరిధిలో వున్న పెద,బడుగు,బలహీన,అగ్రవర్ణ పెద, అనగారిన వర్గాల పిల్లలు చదువుతున్న హాస్టల్స్ పరిస్థితి చూస్తే నాణ్యతలేని ఆహారం,అపరిశుభ్రంగా ఉన్నాయని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. రామయంపేట్ మండల్ పరిదిలోని మోడల్ స్కూల్ లో అల్పహారం తిని అస్వస్థతకు గురైన 20 మంది విద్యార్థుల పట్ల అధికారుల నిర్లక్ష్య వైకరికి కారణమైన బాద్యలను సస్పెండ్ చేయాలని బుధవారం విద్యాహక్కుల పరిరక్షణ ఉద్యమంలో బాగంగా గజ్వేల్ లో విద్యార్థులతో కలిసి ఒక ప్రకటనలో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద,బడుగు,బలహీన,అగ్రవర్ణపెద, అనగారిన వర్గాల పిల్లలు చదువుతున్న హాస్టల్ పరిస్థితి చూస్తే పశువుల పాక కంటే అద్వానంగా ఉన్న పరిస్థితి తెలుస్తుందన్నారు.పెద విద్యార్థులు తినేతిండిలో ఎలుకలు,బల్లులు,తొండలు పడటమంటనే విళ్ళ తిండిపైన గాని,విరు ఉండే స్థలాలో పాములు, కుక్కులు, పందులు స్వైర విహారం చేస్తూంటే ఎట్టికి నడుపుతున్న తీరున హాస్టల్ పరిస్థితిలు ఉన్నయన్నారు. ప్రభుత్వం త్వరితగతిన హాస్టల్‌లో ప్రహరి గొడ, దొమ తెరలు,బాత్ రూం శుభ్రతలు పాటించె విధంగా హాస్టల్ సిబ్బందికి అదేశాలిచ్చి విటిపట్ల నిర్లక్ష్యం వహించేవారి పట్ల చర్యలిసుకొవాలని ప్రభుత్వాన్ని కొరారు.

అంగన్వాడీ సెంటర్‌లో గ్రోత్ మేళా



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండలంలోని రేబర్తి గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌లో పిల్లలకు గ్రోత్ మేళా నిర్వహించినట్టు ఐసీడీఎస్ సూపర్వైజర్ పుష్పలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల, బరువు, పరిశీలించినట్టు ఆమె తెలిపారు. ఎత్తు తక్కువ, బరువు తక్కువ, ఉన్న పిల్లల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నిర్మల, అనురాధ, జ్యోతి, ఏఎన్ఎం మలవొత్రి దేవి, ఆశా కార్యకర్తలు కవిత, కనక లక్ష్మీ, యశోద, సీఓ జయమ్మ, సవిత, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి


గజ్వేల్ రూరల్‌లో


చేర్యాలలో


కొండపాకలో


నంగునూరులో


వర్గల్‌లో

నవతెలంగాణ-గజ్వేల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను, చట్టాలను వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. బుధవారం కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా గజ్వేల్ లోని ఐఓసీ బిల్డింగ్ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్డీవో బన్సీలాల్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. బొగ్గు గనుల బ్లాక్‌లను వేలం వేయడాన్ని నిలుపుదల చేయాలన్నారు. సింగరేణికి నేరుగా గనులు కేటాయించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, 73 షెడ్యూల్ పరిశ్రమల జీవోలను సవరించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించాలన్నారు. ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఐకేపీ వివోఏ, ఆర్పీ, వైద్య, ఆరోగ్య రంగం తో పాటు వివిధ స్కీములలో పనిచేస్తున్న స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. చట్టాలు అమలు చేయాలని జీవో నెంబర్ ఐదును సవరించాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దుచేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని, ఈపీఎఫ్ చెల్లింపులో జాప్యం చేసిన యాజమాన్యాలకు విధించే జరినామాలను తగ్గించడానికి చేసే ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు అయ్యర్ పెన్షన్ పెంచాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఈపీఎఫ్ పెన్షన్ దారులకు కనీస పెన్షన్ రూ. 9 వేలకు తగ్గకుండా చెల్లించాలన్నారు. భవన నిర్మాణ, హమాలీ, ట్రాన్స్పోర్ట్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికి అర్హతలను బట్టి ప్రమోషన్ ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సందిటి రంగారెడ్డి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు నాసగోని వేణుగోపాల్, సీఐటీయూ నాయకులు వెంకటాచారి, మల్లయ్య, రాజులు ,రమేష్ రామారావు, మహేందర్ రెడ్డి, మనోజ్ కుమార్, శ్రీనివాస్, లక్ష్మణ్, పరుశు రాములు, కార్మికులు,తదితరులు పాల్గొన్నారు

నవతెలంగాణ-చేర్యాల

కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని సీఐటీయూ చేర్యాల పట్టణ కన్వీనర్ రాళ్ల బండి భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ మహమ్మద్ సమీర్ అహ్మద్ ఖాన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాళ్ల బండి భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆశా వర్కర్లకు పరీక్షలు రద్దుచేసి కనీస వేతనం అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆలోగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చెల్లిస్తున్నట్టుగా వారితో సమానంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ రేపాక కుమార్, రాళ్లబండి నాగరాజు,సంతోష్, బోయిని మల్లేశం, రాళ్లబండి చందు, మేర్గోజు రామచంద్రం, ప్రశాంత్, రాజు, శేఖర్, యాదగిరి, మంజుల, కనకవ్వ, పద్మ అంజమ్మ, నవ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడవసారి అధికారం చేపట్టిన తర్వాత గత పది ఏండ్లలో సంస్కరణలను, ప్రయివేటీకరణను వేగవంతం చేస్తుందని కార్మికుల డిమాండ్ డే సందర్భంగా సీఐటీయూ కొండపాక మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రోజున తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కార్మికుల కోరికలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ దిలీప్ నాయక్‌కు అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షులు జాలిగామ ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యులు బర్మ కొమురయ్యలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వము కార్పొరేట్ ప్రయివేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు మళ్ళీ గువ్వీల్లు ఊరుతోందన్నారు. నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలంటే మూడోసారి అధికారం చేపట్టగానే వాటిని అమలు జరపడానికి ముందుకు వెళుతుందని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని బొగ్గు బ్లాక్‌ల వేలం రద్దు చేయాలని,కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి కార్మికులకు వర్కర్లకు ఇవ్వాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారము సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఉద్యోగ భద్రత పర్మనెంట్ అమలు చేసి హైయ్యర్ పెన్షన్ చెల్లింపు చెయ్యాలని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు పూర్తి చేసుకుంటున్నా కార్మికులకు ఇచ్చిన హామీల ఊసేలేదన్నారు. కార్మికుల సమస్యలపై చర్చ జరగడం లేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ బాటలోనే నడుస్తుందని మండిపడ్డారు. హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా అమలు చేయాలని, బీడీ కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా ప్రతి కార్మికురాలికి జీవనభృతి కల్పించాలని, గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తూ బకాయి పడ్డ జీతాలు వెంటనే చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ప్రతి కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల యొక్క సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు కొమురయ్య, పల్లే శ్రీనివాస్,కొమ్ము నర్సింలు, సాయి, ఐలయ్య, ముడిగెఅంజయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాటోజు రవీంద్రచారి, కొమురవెల్లి కనకయ్యరైతు సంఘం నాయకులు కనకాచారి, నాయకులు జగపతి నాగరాజు, ఆరుట్లనర్సింలు, పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు, నంగునూరు మండల శాఖ అధ్యక్షుడు దేవులపల్లి రాజమౌళి డిమాండ్ చేశారు. బుధవారం కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా నంగునూరు మండల సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తూ బకాయి పడ్డ జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తి చేసుకున్నప్పటికీ కార్మికులకు ఇచ్చిన హామీల ఊసేలేదన్నారు. హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి ప్రమాద భీమా అమలు చేయాలని పేర్కొన్నారు.మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి గ్రామ పంచాయతీ లో పని చేస్తున్న ప్రతి కార్మికునికి గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు.గత పాలకులు కార్మికులను చాలా ఇబ్బందులకు గురి చేస్తూ కార్మికులకు సరైన వేతనాలు ఇవ్వలేదని ఆరోపించారు.అనంతరం వివిధ డిమాండ్ లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జి.సరితకు అందజేశారు.ఈ కార్యక్రమంలో హమాలి యూనియన్ సంఘం నాయకులు అనరాజు ఎల్లయ్య, దేవులపల్లి బాలరాజు, గ్రామ పంచాయతీ కార్మికుల ఉపాధ్యక్షుడు పిల్లి రవీందర్, ప్రధాన కార్యదర్శి చిట్యాల కనకయ్య, కార్యదర్శి బెల్లం బాలయ్య, దేవులపల్లి బాల నరసవ్వ, జీడికంటి కనకవ్వ, మన్నె యాదవ్వ, రేణుక, కిషన్, శేఖర్, బలరాం, నర్సింలు, బెల్లం శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వర్గల్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకట్ చారి డిమాండ్ చేసినారు.కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా వర్గల్ మండలం ఎమ్మార్వో ఆఫీస్ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకట్ చారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. బొగ్గు గనుల బ్లాక్ లను వేలం వేయడాన్ని నిలుపుదల చేయాలని, సింగరేణికి నేరుగా గనులు కేటాయించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 73 షెడ్యూల్ పరిశ్రమల జీవోలను సవరించాలని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఐకేపీ వీవోఏ, ఆర్పీ, వైద్య, ఆరోగ్య వర్గల్ మండలు సీఐటీయూ నాయకులు బాబురావు గ్రామపంచాయతీ కార్మికులు కనకయ్య, బిక్షపతి, ఎల్లం రాజు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుంది

- సీఐటీయూ మండల కన్వీనర్ వసంత



నవతెలంగాణ-తొగుట

కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ వసంత డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారత సీఐటీయూ డిమాండ్స్ డే సందర్భంగా మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిందని, గత పదేళ్ళుగా సాగించిన సంస్కరణలు, ప్రయివేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు మళ్ళీ కుట్రలు చేస్తుందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని బీజేపీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. సింగరేణి బొగ్గు బ్లాకులను ప్రయివేటీకరణ వేలానికి పూనుకున్నదని మండిపడ్డారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకో వాలని గతంలో పార్లమెంట్లో ఆమోదించుకున్న 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బొగ్గు బ్లాకుల వేలంను రద్దు చేయాలని, ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని అన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వారిని పర్మినెంట్ చేయా లన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ బాటలోనే పయనిస్తున్నదని, కార్మిక వ్యతిరేక విధానాలనే అవలంభిస్తున్నదని ఆరోపించారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమల యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లలో పనిచేస్తున్న కార్మికులకు కొత్త జీవవోలను విడుదల చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ జీవోలలో ఒక్క పైసా వేతనం పెంచలేదని, మోడీ ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను ఆశా వర్కర్లకు నష్టదాయకంగా ఉందన్నారు.బీజేపీ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు పరీక్షలను పెట్టకుండా నిరాకరించాయని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో గత 15 నుంచి 20 ఏండ్లుగా పనిచేస్తున్న ఆశాలకు వయోపరిమితి దాటిన అంగన్వాడీ టీచర్లను, ఆయాలను నామమాత్రం పరీక్షలు నిర్వహిస్తామని నిర్ణయించడం అన్యాయం అన్నారు. తక్కువ బెనిఫిట్స్ ఇచ్చి ఇంటికి పంపుతున్నారని విమర్శించారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనిత, మాధ వి, ప్రవీణ, శ్యామల, దేవమ్మ తదితర కార్మికులు ఉన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడం సిగ్గుచేటు

- బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-మిరుదొడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి ప్రజలకు ఆరు గ్యారంటీలు అందిస్తానని చెప్పిన మాట నిలబెట్టుకోకపోవడం పెట్టకపోవడం సిగ్గుచేటని తాజా మాజీ వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డిలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒక్కటి కూడా అమలు చేయకపోవడం సరికాదని అన్నారు. . నేడు రైతులకు రైతుబంధు పేరును మార్చేసి రైతు భరోసా పేరుగా మార్చిన కనీసం రైతులకు ఇప్పటివరకు రైతు భరోసాను రైతులు అందించకపోవడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం తప్ప వారికి చేసింది ఏం లేదన్నారు. ప్రజలు నేటికీ వారు చేస్తున్న అభివృద్ధిని చూస్తున్నారు తప్ప ప్రజలు అనుకుంటే గద్దేదింపడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంఅందిస్తున్న ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తుమ్మల బాలరాజు, బైరయ్య, జ్యోతి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని సాధించి ఉన్నతులు కావాలి

- వంగ మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-కొండపాక

విద్యార్థి దశ నుంచే లక్ష్యం ఏర్పరచుకొని ఆ దిశగా కష్టపడి ఉన్నతులుగా ఎదగాలని వీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్ రెడ్డి అన్నారు. కొండపాక మండలం సిరసనగండ్ల ఉన్నత పాఠశాలలో బుధవారం వీఎంఆర్ ఫౌండేషన్ సహకారంతో రంగనాయక రచయితల సంఘం ఆధ్వర్యంలో జెర్రైతే, అర్ధాంగి పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో వెలుగులు నింపి ఉన్నతమైన దారులను మార్గ నిర్దేశం చేసే ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పనైనదన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెద్ది విఠల్ మాట్లాడుతూ విద్య వినయానికి, సౌశీల్యానికి మారుపేరని , విద్యార్థులు చదువు పై కృషి చేస్తే భావి భారత పౌరులుగా ఎదుగుతారన్నారు. రంగనాయక రచయితల సంఘం అధ్యక్షులు పిన్నింటి మహేంద్రారెడ్డి మాట్లాడుతూ ఉన్నతమైన విలువలు పొందాలంటే విద్యార్థులుగా చిన్నతనంలో కష్టపడి లక్ష్యాన్ని చేరాలని ఈ కథల పుస్తకాలు అందుకు చాలా ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాశాఖ డైరెక్టర్‌కు అభినందనలు

- మల్లికార్జున్


గజ్వేల్‌లో | జగదేవ్‌పూర్‌లో

నవతెలంగాణ-గజ్వేల్

విద్యాశాఖ నూతన డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నరసింహారెడ్డిని సీపీఎస్ సంఘ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మల్లికార్జున్ హైదరాబాద్‌లో గల తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన గజ్వేల్ ప్రాంత ముద్దు బిడ్డ నేడు విద్యాశాఖ సంచాలకులుగా ఎదగడం ఉపాధ్యాయ లోకానికి చాలా గర్వ కారణం అని, వారి మార్గ నిర్దేశనంలో తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యా రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

నవతెలంగాణ- జగదేవ్‌పూర్

విద్యాశాఖ నూతన డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నరసింహారెడ్డి టీపీటీఎఫ్ జగదేవపూర్ అధ్యక్షులు నేతి శంకర్ హైదరాబాద్‌లో గల తన కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన గజ్వేల్ ప్రాంత ముద్దు బిడ్డ నేడు విద్యాశాఖ సంచాలకులుగా ఎదగడం ఉపాధ్యాయ లోకానికి చాలా గర్వ కారణం అని, వారి మార్గ నిర్దేశనం లో తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యా రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జగదేవ్‌పూర్ మండల పాఠశాలలకు అన్ని సౌకర్యాలు కల్పించుటకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలి

- ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి నాచారం శేఖర్



నవతెలంగాణ- గజ్వేల్

సిద్దిపేటలో జరిగే కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం పత్రికా విలేకరులతో ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ కార్యదర్శి నాచారం శేఖర్ పిలుపునిచ్చారు.రాష్ట్రంలో గత ఐదేండ్ల నుంచి విద్యార్థులకి స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయలేదన్నారు. అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం తీరుగా విద్యార్థుల పట్ల వ్యవహరిస్తుందన్నారు. విద్యార్థుల విషయంలో నూతన ప్రభుత్వం చిన్న చూపు చూడడం సిగ్గుచేటన్నారు. కొన్ని వేల మంది విద్యార్థులకు స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వల్ల చాలా మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు నష్ట పోతున్నారన్నారు. పై చదువులకి వెళ్ళాలంటే ప్రయివేటు కళాశాలలలో రియంబర్స్మెంట్ విడుదల కాక సర్టిఫికెట్ ఇవ్వడం లేదు దీని వల్ల విద్యార్థులు ఫీజులు కట్టలేక పై చదువులు చదవలేకపోతున్నారు.ఇలా ప్రతి ప్రభుత్వం విద్యార్థుల పై చిన్న చూపు చూడడం వల్ల విద్యార్థులు విద్యకి నోచుకోవడం లేదన్నారు. నూతన ప్రభుత్వం విద్య వ్యవస్థలో పూర్తిగా విఫలమైంది అన్నారు. ఇప్పటి కైన విద్యార్థుల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రేపు కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమనికి పెద్ద ఎత్తున విద్యార్థులు, విద్యార్థినీలు, పాల్గొని ముట్టడి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశం ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు కోనేరు ప్రవీణ్, ఉపాధ్యక్షులు ప్రణయ్, నాయకులు వేముల ప్రవీణ్ శేఖర్, లోకేష్, పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-ములుగు

తెలంగాణ రాష్టంలో ఉన్న రైతుల సమస్యల పక్షాన ములుగు మండల అధ్యక్షులు శ్రీనివాస్ ఆధ్వర్యం తహసీల్దార్‌కి బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు పల్లె నవీన్ ముదిరాజ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడాన్ని బీజేపీ కిసాన్ మోర్చా తీవ్రంగా నిరసిస్తున్నది. ప్రధానంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పేరుతో ఇచ్చిన హామీని నెరవేర్చలేక పోవడం దురదృష్టకరం. ఇక రూ. 2లక్షల వ్యవసాయ రుణ మాఫీ పథకం విషయంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 200 రోజులు గడుస్తున్నా ఈ ప్రభుత్వం ఇంకా రైతులను గందరగోళ పరుస్తూనే ఉంది. బీజేపీ కిసాన్ మోర్చా రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన అన్ని హామీలను ఎటువంటి ఆంక్షలు లేకుండా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. లేనిచో రైతులను సంఘటిత పరిచి ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ఈ ప్రభుత్వాన్ని బీజేపీ కిసాన్ మోర్చా హెచ్చరిస్తున్నది. ఈ కార్య క్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా సీనియర్ నాయకులైన నాన్సవోలు సుదర్శన్ రెడ్డి, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శులు మధు, వీరేష్, నర్సింలు,ఉపాధ్యక్షులు మల్లేష్ యాదవ్, కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, కిసాన్ మోర్చా గ్రామ శాఖ అధ్యక్షులు భాస్కర్ గౌడ్, శ్రీనులు పాల్గొన్నారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ

- డీఈఓ శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల పరిధిలోని వేచరేణి ,మండల కేంద్రంలోని బీడీ కాలనీ,బండపల్లిలో గల ప్రాథమిక, ఉర్దూ పాఠశాలలను బుధవారం జిల్లా విద్యా శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డీఈఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో డిజిటల్ టీవీలను ఉపయోగిస్తూ విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు.వేచరేణి పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య పరీక్షలను పరిశీలించి విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తగు సూచనలు చేశారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ ,గణితం చదవడం, రాయడాన్ని పరిశీలించారు.డీఈఓ వెంట సీఆర్పీ రాజు ఉన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



నవ తెలంగాణ -గజ్వేల్

ప్రాథమిక పాఠశాల గజ్వేల్ మండలం రిమ్మన గూడలో బదిలీపై వెళ్లి ఉపాధ్యాయులు జి .గోపికల, డి వేణులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో బదిలీపై వెళ్లినటువంటి ఉపాధ్యాయు రాలు జి. గోపికల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్లేట్లు ఇచ్చారు. డి. వేణు మాజీ చైర్మన్ సిద్దాల శివకుమార్‌కు రూ.వెయ్యి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉప్పరపల్లి నాగభూషణం, ఉపాధ్యాయులు సిహెచ్ భద్రమ్మ ,సురేష్ పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ న్యాయవాదుల నిరసన



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట కోర్టులో పనిచేస్తున్న న్యాయవాది రవీందర్ పై దాడి చేసిన సిద్దిపేట టూ టౌన్ ఏఎస్ఐ ఉమారెడ్డిని, సీఐని వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేసి, వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట బార్ అసోసియేషన్ కార్యవర్గం, న్యాయవాదులు స్థానిక కోర్ట్ బయట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కోర్ట్ నుంచి స్థానిక వన్ టౌన్ స్టేషన్ వరకు ర్యాలీ రూపంలో వెళ్లి, వన్ టౌన్ సీఐకి పూర్తి విచారణ జరిపి అకారణంగా దాడి చేసిన ఏఎస్ఐపై కేసు నమోదు చెయ్యాలని, దాడికి గురైన న్యాయవాది రవీందర్‌తో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం సిద్దిపేట జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో న్యాయవాదిపై దాడికి నిరసనగా రెండు రోజుల పాటు కోర్టు విధులకు హాజరు కావద్దని తీర్మానం చేయించుకున్నట్టు న్యాయవాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, న్యాయవాదులు సాయిబాబా, శివాజీ, తాటికొండ రమేష్, కర్రోల్ల రవిబాబు, యాదగిరి, సాయినారాయణ, పవన్, కార్తీక్, నగేష్, భూమిరాజ్, రేణుక, సూర్యకళ, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

శ్రీవాణి స్కూల్ కు షోకాజు నోటీసు

- ఎంఈఓ జోగు ప్రభుదాస్




నవతెలంగాణ- దుబ్బాక

స్కూల్ యాజమాన్యం తప్పిదం, నిర్లక్ష్యపు జవాబుదారితనం పట్ల మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ బుధవారం శ్రీవాణి స్కూల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసును జారీ చేశారు.ఒక్కరికి బదులు మరొక్క విద్యార్థినిని వేరే సహాయకులతో ఇంటికి పంపడం పట్ల పత్రికల్లో వచ్చిన వార్తకు ఎంఈఓ ప్రభుదాస్ చర్యలకు ఉపక్రమించారు.అనంతరం శ్రీవాణి పాఠశాలను తనిఖీ చేశారు.ఫైర్ సేఫ్టీ నిబంధనలు, స్కూల్ జోన్ సూచిక బోర్డులు, పాఠశాల ముందు స్పీడ్ బ్రేకర్లు, అండర్ గ్రౌండ్‌లో తరగతి గదుల నిర్వహణ, విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు లేకపోవడం వంటి పలు నిబంధనలను విస్మరించడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. వారం రోజుల గడువుతో అన్ని సౌకర్యాలు సమకూర్చాలని ఆదేశిస్తూ షోకాజ్ నోటీసును జారీ చేశారు.లేకపోతే పాఠశాల గుర్తింపు రద్దు కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు.పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యుడు ఆకుల భరత్, పలువురున్నారు.

పెండింగ్ ఫీజుల నిధుల్ని వెంటనే విడుదల చేయాలి

- ఏఐపీఎస్‌యూ నాయకులు రంగమైన స్వామి



నవ తెలంగాణ -దుబ్బాక

పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ నిధుల్ని వెంటనే విడుదల చేయాలని ఏఐఎ ఎస్‌యూ సిద్దిపేట జిల్లా నాయకులు రంగమైన స్వామి డిమాండ్ చేశారు. బుధవారం దుబ్బాకలో మీడియాతో మాట్లాడుతూ...స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు రాక సర్టిఫికెట్లను ఇవ్వడంలో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్, ఉపకార వేతనాల్ని విడుదల చేయకుండా ఆరేళ్లుగా జాప్యం ప్రదర్శించిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయిన సర్కార్ పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఏఐపీఎస్‌యూ దుబ్బాక డివిజన్ నాయకులు బరిగె మనోహర్, విక్రమ్, రంజిత్ ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘన సన్మానం



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ మండల కేంద్రం లోని ఉన్నత పాఠశా లలో గత 8 ఏండ్లకు పైగా ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి బదిలీ పై వెళుతున్న ఉపాధ్యాయులకు నూతనంగా పాఠశాల కు బదిలీ పై వచ్చిన ఉపాధ్యాయులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం ఆధ్వర్యంలో బుధవారం వీడ్కోలు, స్వాగత సమావేశం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో ఘనంగా సన్మా నించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు పలికారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు వెంకటేశం మాట్లాడుతూ..ఉద్యోగ వృత్తిలో బదిలీలు కావడం సర్వ సాధారణమని పాఠశాల విద్యాభివృద్ధికి వారు అందించిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమణ రావు, సిద్దయ్య, వందన,గణేష్, ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయ బృందం, తదితరులున్నారు.

మద్దూరుకు ఎస్‌ఐ రావాలంటే నెలలు కావాల్సిందేనా..?

- మద్దూరు మండల ప్రజలు, ఫిర్యాదారులు



నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు పోలీస్ స్టేషన్ నుండి ఎస్సై బదిలీ అయితే నూతన ఎస్‌ఐ రావడానికి నెలలు కావాల్సిందేనా..?అని మండల ప్రజలు,ఫిర్యాదారులు వాపోతున్నారు. మద్దూరు ఎస్‌ఐ గా పనిచేసిన షేక్ యూనిస్ అహ్మద్ అలీ, 14 రోజుల క్రితం బదిలీపై కరీంనగర్ వెళ్లడంతో. మద్దూరు నూతన ఎస్సైగా ఇప్పటివరకు ఎవ్వర్నీ పై అధికారులు నియమించకపోవడం శోచనీయంగా ఉందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదారులు సైతం ఎస్‌ఐ లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు రాలేకపోతున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ లేకపోవడంతో చేర్యాల సీఐ శ్రీను మూడు, నాలుగు రోజులకోసారి వచ్చి సిబ్బందితో కేసుల వివరాలు అడిగి తెలుసుకుని వెళ్తున్నారు. మండలంలో దొంగల బెడద ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వం వెంటనే మద్దూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అగ్నివీర్ వాయు నియమాలకు దరఖాస్తులు

- రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీలచంద్రం



నవతెలంగాణ- రాయపోల్: అగ్నివీర్ వాయు నియామకాలకు నోటిఫికేషన్ వెలువడిందని నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఆజాద్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్, రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీలచంద్రం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు సైనికుడిగా పనిచేసేందుకు అవివాహితులైన అభ్యర్థుల నుంచి అధికారులు దరఖాస్తులు ఆహ్వానిస్తూనారన్నారు. ఈనెల 8న ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ ఈనెల 28న రాత్రి 11:00 గంటలతో ముగియనున్నట్లు ఆయన తెలిపారు. ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కోసం వెబ్ సైట్ ను సందర్శించాలని సూచించారు. మరిన్ని విషయాలకి ఈ కింది మొబైల్ నెంబర్ లను 8290694814,9948643620 సంప్రదించగలరు.

ముగిసిన ఎంసెట్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీరింగ్ ప్రవేశాల కొరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన బుధవారంతో ముగిసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సూర్య నారాయణ తెలిపారు. ఎంసెట్ కౌన్సెలింగ్‌కు 140 మంది హాజరయ్యారు. నితిన్ పవార్, మాణిక్యం, సిహెచ్.శ్రీనివాస్, రాజు, సంధ్యా రాణి, కవిత, జ్యోతి, విజయ్ కుమార్, శ్రీనివాస్, రాజమౌళి, స్వామి, వాణి తదితరులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలి

- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం పద్మ











నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాన్ని నశించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, నాలుగు లేబర్ కార్డు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏం పద్మ డిమాండ్ చేశారు.బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో సీఐటీయూ అఖిల భారత కేంద్రం పిలుపులో భాగంగా డిమాండ్స్ డే సందర్భంగా తాహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఎమ్మార్వోకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏం పద్మ మాట్లాడుతూ....కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి, గత పదేళ్ళుగా సాగించిన సంస్కరణలు, ప్రయివేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు మళ్ళీ ఉవ్విళ్ళూరుతున్నది. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే 4 లేబర్ కోడ్లను అమలు చేస్తామని బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. బొగ్గు బ్లాకుల వేలానికి పూనుకున్నది. ఈపీఎఫ్ సకాలంలో చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానాలను భారీగా తగ్గించింది. కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని గతంలో పార్లమెంట్లో ఆమోదించుకున్న 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, బొగ్గు బ్లాకుల వేలంను రద్దు చేయాలని, ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని, కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వారిని పర్మినెంట్ చేయాలని, ఆలోపు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తమరికి ఈ వినతి పత్రాన్ని అందిస్తున్నాం, మీ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసులు చేయాలని కోరుతున్నాము. ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు పార్లమెంట్లో ప్రమాణస్వీకారం చేయకముందే, బీజేపీ ప్రభుత్వం మతోన్మాద కార్పొరేట్ శక్తులకు లాభాలు ఒడిసి పట్టేందుకు రంగంలోకి దిగింది. కార్మికుల ఈపీఎఫ్ బకాయిల చెల్లింపులో యాజమాన్యాలకు విధించే జరిమానాలను భారీగా తగ్గించింది. నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ (ఎన్ఎంపీ) పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను లీజుకివ్వడం, అమ్మివేయడం, ప్రయివేటీకరణ చేయడం లాంటివి మరింత వేగవంతం చేస్తామని ప్రకటించారు. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర ప్రభుత్వం బహిరంగ వేలం వేస్తున్నది. ఉద్యోగ భద్రత, పర్మినెంట్, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్ చెల్లింపు, ఓపిఎస్ రద్దు, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తింపు వంటి అంశాలపై మాత్రం కేంద్ర బీజేపీ ప్రభుత్వం నోరు మెదపకపోవడం అన్యాయం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలతో పాటు ఉద్యోగ, కార్మికులకు అనేక హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చి 6 నెలలు గడిచినా ఇచ్చిన హామీల గురించిన ఊసే లేదు. కార్మిక సమస్యలపై కనీసం చర్చ కూడా చేయలేదు. ఈ కాలంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి పారిశ్రామికవేత్తలు, ఐటీ అధిపతులు, ఫార్మా యాజమాన్యాలతో పాటు మధ్యతరగతి పరిశ్రమల యజమానులు, పెద్ద పెద్ద కాంట్రాక్టర్లతో అనేకసార్లు సమావేశాలు జరిపారు.ముఖ్యమంత్రి కార్మిక సంఘాలతో సమావేశం కావాలని, కార్మిక సమస్యలు చర్చించాలని కార్మిక సంఘాలు చేస్తున్న డిమాండ్ను పట్టించుకోవడం లేదు.రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీజేపీ బాటలోనే పయనిస్తున్నది. కార్మిక వ్యతిరేక విధానాలనే అవలంభిస్తున్నది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమల యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్లో పనిచేస్తున్న కార్మికులకు కొత్త జీఓలను విడుదల చేసింది. కానీ ఆ జీఓలలో ఒక్క పైసా కూడా వేతనం పెంచలేదు. మోడీ ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను ఆశా వర్కర్లకు నష్టదాయకమని, బెనిఫిట్స్ ఇచ్చి ఇంటికి పంపుతున్నారు. ఐటి పరిశ్రమలకు 4 ఏండ్లు కార్మిక చట్టాల నుంచి మినహాయింపు ఇచ్చింది. రాష్ట్రంలో కూడా 4 లేబర్ కోడ్లను అమలు చేస్తామని పత్రికలకు లీకులు ఇస్తున్నది. ఇది కార్మిక వర్గానికి ప్రమాదం. కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మామిడాల కనకయ్య నాయకులు గుర్రం నరసింహులు దొబ్బెడ రాజయ్య వినోధ రాజు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-మిరుదొడ్డి : అంగన్వాడీ, గ్రామపంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదని సీఐటీయూ మండల కన్వీనర్ లింగంపేట ఎల్లం అన్నారు. బుధవారం అక్బర్ పట భూంపల్లి మండలం అక్బర్ పేట తాహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించి ధర్నాను చేపట్టారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనంతో పాటు కని సౌకర్యాలు కల్పించడంలో నిదురమైందని అన్నారు. నిత్యవసర ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వారికి కనీస వేతనం రూ.20వేల అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కూతురు స్వామి, రైతు కూలీ సంఘం అధ్యక్షులు కుమ్మరి శ్రీనివాస్, బక్కి స్వామి, బొంపల్లి అమాలి, గ్రామ సంఘం అధ్యక్షుడు కుమ్మరి ఎల్లమ్మ, ఉపాధ్యక్షుడు బక్కి తోటయ్య, సభ్యులు ఇంద్రం, అలాగే మండల కమిటీ సభ్యులు ఉసికె కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మర్కుక్

గ్రామపంచాయతి కార్మికుల పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని మర్కుక్ తహసీల్దార్ చంద్రశేఖర్ రావుకు బుధవారం కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వెతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాలను ఉన్న మురికి తొలగించి శుభ్రం చెసిన తమ వెతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు నడవలేని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండలాధ్యక్షురాలు బాగ్యలక్ష్మీ, వివిధ గ్రామాల కార్మికులు, తదితరులున్నారు.

నవ తెలంగాణ- రాయపోల్

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ప్రభుత్వాలు చెల్లించాలని సీఐటీయూ దౌలతాబాద్ మండల కన్వీనర్ ఎస్ లక్ష్మి అన్నారు. బుధవారం డిమాండ్స్ డే సందర్భంగా దౌల్తాబాద్ మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిందని, గత పదేళ్ళుగా కొనసాగించిన సంస్కరణలు, ప్రయివేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు మళ్ళీ కుట్రలు చేస్తుందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను అమలు చేస్తామని బీజేపీ ప్రభుత్వం ప్రకటించిందని, సింగరేణి బొగ్గు బ్లాకులను ప్రయివేటీకరణ వేలానికి పూనుకున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని గతంలో పార్లమెంట్లో ఆమోదించుకున్న 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. బొగ్గు బ్లాకుల వేలంను రద్దు చేయాలని, ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని, కార్మీకులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీజేపీ బాటలోనే పయనిస్తున్నదని, కార్మిక వ్యతిరేక విధానాలనే అవలంభిస్తున్నదన్నారు.ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమల యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ లలో పనిచేస్తున్న కార్మికులకు కొత్త జీఓలను విడుదల చేసింది. కానీ ఆ జీఓలలో ఒక్క పైసా కూడా వేతనం పెంచలేదని, మోడీ ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను ఆశా వర్కర్లకు నష్టదాయకమని, బీజేపీ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పరీక్షలను పెట్టకుండా నిరాకరించాయని, మన రాష్ట్రంలో మాత్రం గత 15 నుంచి 20 ఏండ్లుగా పనిచేస్తున్న ఆశాలకు వయోపరిమితి దాటిన అంగన్వాడీ టీచర్లను, ఆయాలను నామమాత్రం పరీక్షలు నిర్వహిస్తామని నిర్ణయించడం అన్యాయం అన్నారు.తక్కువ బెనిఫిట్స్ ఇచ్చి ఇంటికి పంపుతున్నారని విమర్శించారు.కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యకంలో బాలరాజు, అశోక్,మల్లేశం,మల్లమ్మబాలవ్వఅంజయ్య, ఎల్లం,దాదాఖాన్,అంజయ్య,రాములు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండల కేంద్రంలో కార్మికుల కోరికల డే సందర్భంగా వారి యొక్క డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఎంపీడీవో జయరాంకు గ్రామపంచాయతీ కార్మికులు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చినటువంటి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, బొగ్గు బ్లాక్‌ల వేలం రద్దు చేయాలని కోరారు. అంతేకాకుండా కార్మికులందరికీ రూ.26వేల వేతనం నిర్ణయించాలని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలియజేశారు. జీవో నెంబర్ 5ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు

నవ తెలంగాణ- దుబ్బాక

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ దుబ్బాక పట్టణ కన్వీనర్ కొంపల్లి భాస్కర్ డిమాండ్ చేశారు.అఖిల భారత సీఐటీయూ డిమాండ్స్ డే సందర్భంగా బుధవారం దుబ్బాక పురపాలిక పరిధిలోని సమీకృత కార్యాలయ భవన సముదాయంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ధర్నా నిర్వహించారు.అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు.మూడోసారి అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా సాగించిన సంస్కరణలు,ప్రైవేటీకరణ విధానాలను మరలా వేగవంతంగా అమలు చేసేందుకు కుట్రలు పన్నుతుందని విమర్శించారు.కేంద్రం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే విరమించుకోవాలని, అలాగే నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను, బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసనలో సీఐటీయూ పట్టణ నాయకులు రాజు,మంజుల,శ్యామల,అనిత,భారతి,లత,వసుంధర పలువురు పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్తు బాగుంటుంది

- విద్యార్థులు చెడు వ్యసనాల వైపు చూడొద్దు
- గజ్వేల్ షీ టీమ్ అధికారి శ్రీరాములు



నవతెలంగాణ-మర్కుక్

విద్య తోనే మంచి భవిష్యత్తు ఉంటుందని చదువుకునే సమయంలో చెడు వ్యసనాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని గజ్వేల్ షీ టీ మ్ అధికారి శ్రీరాములు అన్నారు.బుధవారం మండల పరిధిలోని ఎర్రవల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల, షీ టీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీ టీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో , షీ టీమ్స్ , యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి, అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్, మాటలు నమ్మొద్దని, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుంది, మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, మహిళల భద్రత మా ముఖ్య బాధ్యత విద్యార్థులు చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావొద్దు అన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని, సామాజిక రుగ్మతల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ, మహిళా కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రాంచంద్రారెడ్డి, మర్కుక్ పోలీస్ సిబ్బంది కృష్ణ,పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులున్నారు.

దంపతుల ఆత్మహత్య... అనాదలుగా పిల్లలు



నవతెలంగాణ- జగదేవ్‌పూర్

ఇద్దరు దంపతుల ఆత్మహత్యతో పిల్లలు అనాదలుగా మారిన సంఘటన జగదేవ్‌పూర్ మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటిక్యాల గ్రామానికి చెందిన కరకపట్ల శేఖర్ (36) అనే వ్యక్తికి జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన ఆకారం సౌమ్య 27తో ఆరేళ్ల క్రితం ఇద్దరికి వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఐదేళ్లపాటు సంసారం సవ్యంగా జరిగినప్పటికీ గత ఏడాది నుంచి కుటుంబంలో కలహాలు ప్రారంభమయ్యాయి. దీంతో తరచూ కుటుంబంలో కలహాలు జరగడంతో పలుసార్లు ఇరువురి పెద్దలు దంపతులిద్దరిని సముదాయించి సర్ది చెప్పారు. ఇటీవల సౌమ్య తల్లి లక్ష్మీ అనారోగ్యంతో మృతి చెందడంతో సౌమ్య దౌలాపూర్ లోనే ఉంటున్నది. కాగా రెండు నెలల క్రితం శేఖర్ వచ్చి తన భార్య సౌమ్యను తీసుకొని తుర్కపల్లిలో మామిడి తోటలో సూపర్ వైజర్‌గా పనిచేసుకుంటూ ఉంటున్నారు. అయినప్పటికీ ఇద్దరి మధ్య తరచు గోడవలు జరుతూనే ఉన్నాయి. ఇద్దరూ తీవ్ర మానస్థాపనికి చెంది మంగళవారం అర్ధరాత్రి ఇటిక్యాలకు వచ్చి తమ పొలం వద్ద చేరుకుని పురుగుల మందు సేవించారు. సమాచారం తెలియగానే స్థానికులు వెంటనే 108 ఫోన్ ద్వారా సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం దంపతులిద్దరిని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాదులో గల ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా భార్య సౌమ్య మృతి చెందగా, బుధవారం చికిత్స పొందుతూ శేఖర్ మృతి చెందారు. సౌమ్య తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. తల్లిదండ్రులు ఇద్దరు ఆత్మహత్య చేసుకోవడం వల్ల ఇద్దరు కుమారులు అనాథలుగా మారారు.

104 స్క్రాప్ వాహనాల ఈ వేలం

నవ తెలంగాణ - సిద్దిపేట

జిల్లా కార్యాలయంలోని 104 స్క్రాప్ వాహనాలను ఈ వేలం వేస్తున్నట్టు, వేలంలో పాల్గొనేవారు యాక్షన్ డాట్ తెలంగాణ డాట్ ఇన్ వెబ్ సైట్ లో సంప్రదించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 104 స్క్రాప్ వాహనాల జిల్లాలో మొత్తం 8 స్క్రాప్ వాహనాలు ఉన్నాయని తెలిపారు.

ఆపదలో ఆదుకోవడమే నిజమైన స్నేహం



నవతెలంగాణ- రాయపోల్

స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం అన్నట్టు స్నేహితులు ఆపదలో ఉంటే ఆదుకోవడమే నిజమైన స్నేహానికి అర్థమని నిరూపించారు 2002- 2003 బ్యాచ్ పదవ తరగతి స్నేహితులు. తమ స్నేహితుడు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై మంచానికి పరిమితమైతే అతడికి చేదోడు వాదోడుగా నిలవాలని స్నేహితులందరూ కలసి బుధవారం దౌల్తాబాద్ మండలం శేరిపల్లి బందారం గ్రామానికి చెందిన నాగరాజు అనారోగ్యంతో బాధపడ ుతుండగా స్నేహితులు పరామర్శించి అత్యవసర సరుకులు, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు స్నేహితులు మాట్లాడుతూ స్నేహితుల అనగానే పార్టీలు, సినిమాలు, షికారులు చేయడమే కాదు కష్టసుఖాలలో అండగా నిలవడమే నిజమైన స్నేహం అనిపిస్తుంది. 2002- 2003 పదవ తరగతి బ్యాచ్ శేరిపల్లి బందారం గ్రామానికి చెందిన మా స్నేహితుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై కుడికాలు వైద్యులు తీసివేశారు. దానితో గత కొన్ని రోజులుగా మంచానికే పరిమితమై చికిత్స పొందుతున్నాడు. ఇట్టి విషయం తెలుసుకుని అతని కుటుంబానికి స్నేహితులుగా అండగా నిలవాలని నిత్యవసర సరుకులు, రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారన్నారు. అధైర్య పడవద్దని ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 2002 -2003 బ్యాచ్ పదవ తరగతి స్నేహితులు నాగరాజుగౌడ్,శ్రావణ్,స్వామి,యాదగిరి, పెంటయ్య,గణేష్,యాదిరెడ్డి, రాజలింగం, భూపాల్ రెడ్డి, చంద్రం,రమేష్,రాములు,పోచయ్య, నర్సింలు, బిక్షపతి పాల్గొన్నారు.

సమాజ హితమే లయన్స్ లక్ష్యం

- లయన్ సూర్యారాజ్



నవ తెలంగాణ - సిద్దిపేట

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సమాజ హితం కోసం అంకితభావంతో పనిచేసి సిద్దిపేట లయన్స్ క్లబ్ కు పేరు తేవాలని సూర్య రాజ్ సూచించారు. స్థానిక లయన్స్ భవన్ లో సిద్దిపేట లయన్స్ క్లబ్ 52వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. కార్యవర్గం సమిష్టిగా పనిచేయాలని, శాశ్వత ప్రమాణికతతో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. లయన్స్ డిస్టిక్ గవర్నర్ 1, 2 లు అమర్నాథ్ రావు, విజయలక్ష్మిలు మాట్లాడుతూ.. సిద్దిపేట లయన్స్ క్లబ్ కు ఎంతో పేరు ఉన్నదని, గతంలో పనిచేసిన కార్యవర్గం కంటే మిన్నగా పనిచేసి అందరి ఆదరాభిమానాలు చూడగొనాలన్నారు. గత ఏడాది కాలంలో సిద్దిపేట లైన్స్ క్లబ్ ఒక వెయ్యికి పైగా కార్యక్రమాలు చేపట్టి అంతర్జాతీయ లైన్స్ నుంచి ప్రశంసలు పొందడం శుభపరిణామన్నారు. వివిధ సేవల్లో ప్రత్యేక కృచేసిన వారికి అవార్డులు ప్రధానం చేశారు. డాక్టర్స్ డే ను పురస్కరించుకొని సిద్దిపేటలోని 10 మంది డాక్టర్లను మోమెంటో, శాలువా, బొకేలతో ఘనంగా సన్మానించారు. సిద్దిపేట లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా జోజి, ప్రధాన కార్యదర్శిగా వైవి సురేష్ కుమార్, కోశాధికారిగా నరసింహారెడ్డిలు బాధ్యతలు స్వీకరించి కమిటీతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం ప్రోగ్రాం చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి ,నిర్మల, గంప రమేశ్, మామిడాల శ్రీనివాస్, వైకుంఠం, శేఖర్, నాగరాజం, వినోద్ మోదాని, గోలి సంతోష్, శ్రీధర్, మధు, సత్యం, చందు, నర్సింలు ,భాస్కర్, అశోక్ రెడ్డి, సత్యానందం, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దళిత మోర్చా మున్సిపల్ అధ్యక్షుడిగా కనకరాజు



నవ తెలంగాణ- దుబ్బాక

బీజేపీ దళిత మోర్చా మున్సిపల్ అధ్యక్షుడిగా దుబ్బాక పురపాలిక పరిధిలోని చెల్లాపూర్ వార్డుకు చెందిన గంభీర్‌పూర్ కనకరాజు నియావ ుకమైనారు.ఈ నియామక పత్రాన్ని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు చేతుల మీదుగా అందజశారు.కనకరాజు మాటా్లడుతూ ...తన నియామకానికి సహకరించిన బీజేపీ నాయకు లకు, మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపా రు.పార్టీ బ లో పేతం కో సం తన శక్తి వం చన లేకు ండా కృషి చేసా ున్నా రు. కనకయ్య, బాబు ,రాజు, బుగ్గరా జు,మహేష్ బద్రి ఉన్నారు.